ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
3
శుక్రవారం 17 అక్టోబరు 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 22.0


రాజాధిరాజ.. వైభవం

అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్షతులసీ పూజా మహోత్సవం వైభవంగా జరిగింది. రాత్రికి రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు అలంకృతుడై గజవాహనంపై ఆధిరోహించి వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో తిరువీధులలో విహరించారు.

కొబ్బరి కళకళ

కొబ్బరి సాగుకు మంచి రోజులు వచ్చాయి. కొన్ని నెలలుగా కాయల ధరతోపాటు, ప్రభుత్వం నుంచి సహకారం పెరగడంతో సాగు చేసేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. ఫలితంగా రెండు నెలలుగా కొబ్బరి మొక్కల ధరలు పెరిగాయి. ఇరవై ఏళ్ల క్రితం మాదిరి కొబ్బరి నాటే ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 23,061 హెక్టార్లలో కొబ్బరి సాగు అవుతోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో రెండేళ్ల క్రితం వరకు 7,800 హెక్టార్లకు పైగా సాగు ఉండగా, ప్రస్తుతం 8,301 హెక్టార్లకు పెరిగింది. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.



పెరిగిన ధరలు.. ప్రభుత్వ సాయం

ఒక్కో మొక్కకు రూ.350..
హెక్టారుకు రూ.56 వేలు
రైతు ఖాతాల్లో జమ

(భీమవరం రూరల్-ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా కొబ్బరి సాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొబ్బరి అభివృద్ధి సంస్థ ఆర్థిక సహకారం అందిస్తోంది. 2024 ఏప్రిల్ వరకు ఏడాదికి రూ.40 చొప్పున రెండేళ్లపాటు రూ.80 ఇచ్చేది. ఇప్పుడు ఈ మొత్తం పెరిగింది. ఒక్కో మొక్కకు ఏడాదికి రూ.175 చొప్పున రెండేళ్లకు రూ.350 అందిస్తోంది. ఈ లెక్కన హెక్టార్ సాగు చేసే కొబ్బరి రైతులకు రూ.56 వేలు ప్రభుత్వ సాయం దక్కుతోంది. ఇది కొబ్బరి రైతులకు ఎంతో మేలు చేసింది. గడిచిన మూడు నెలల్లో కాయల ధరలు రెట్టింపు అయ్యాయి. మొన్నటి వరకు రూ.9 వున్న కాయ ధర ప్రస్తుతం రూ.20 దాటింది. ఈ లెక్కన 20 కొబ్బరి మొక్కలు వున్న రైతుకు ఏడాదికి రూ.50 వేలకుపైగా ఆదాయం లభిస్తోంది. ఈ ఏడాది జిల్లాలో 50 హెక్టార్లలో కొబ్బరి సాగు మొదలు పెట్టిన రైతులందరికీ ప్రభుత్వం సారం అందే అవకాశం ఉంది. వచ్చే ఏడాది సాగు రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.

కొబ్బరికి పూర్వ వైభవం

1996 చివర నవంబరు 6వ తేదీన వచ్చిన తుఫాన్ కారణంగా పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో లక్షల కొబ్బరి చెట్లు దెబ్బతిన్నాయి. ఇతర పంటలతోపాటు కొబ్బరికి భారీ నష్టాన్ని కలిగించింది. ఆ తర్వాత కొబ్బరికి నల్ల మట్టి పురుగు వ్యాపించడంతో ఆకులు ఎండిపోయేవి. కొబ్బరి బొండాలపై చుట్టూ నల్లగా మచ్చలు ఏర్పడేవి. ఈ క్రమంలో ధర పతనమైంది. ఈ క్రమంలో గిట్టుబాటు కాక పోవడంతోపాటు రియల్ ఎస్టేట్‌కు, వరి పంటకు అడ్డుగా వున్నాయనే భావించి వేలాది చెట్లను తొలగించారు. కాని, రెండేళ్లుగా ధర ఆశాజనకంగా ఉండటం, తెగుళ్లు పెద్దగా లేకపోవడంతో సాగుపై ఆసక్తి పెరిగింది. మళ్లీ పూర్వపు రోజులు మాదిరి కొబ్బరి కళకళలాడుతోంది.

- సాగుకు రైతుల ఆసక్తి.. రెండేళ్లల్లో వెయ్యి హెక్టార్లలో చెట్లు
- రూ.20కు చేరిన కొబ్బరి కాయ.. రైతుకు నెలవారీ ఆదాయం



ప్రభుత్వ సాయం కావాలంటే..

- కొబ్బరి సాగు చేయాలనుకునే రైతులు ప్రభుత్వం నుంచి సబ్సిడీ కావాలంటే కోకోనట్ అభివృద్ధి సంస్థకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లోను దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఒక రైతుకు కనిష్ఠంగా 20 సెంట్లు భూమి ఉండాలి. గరిష్ఠంగా 5 ఎకరాలు భూమి వరకు ఉండవచ్చు.
- హెక్టార్‌కు 160 కొబ్బరి మొక్కలు నాటుకోవాలి. మొక్కలు లెక్కన ప్రభుత్వం సహకారం అందుతుంది.
- రిజిష్టర్ అయిన హేచరీ నుంచే మొక్కలు కొనుగోలు చేయాలి.
- పొడుగు రకాల మొక్కలు నాటాలి.
- నాటిన తర్వాత ఆర్ఎస్‌కే సిబ్బంది వచ్చి వాటిని ఫొటోలు తీసి నమోదు చేసుకుంటారు.

కష్టాల్లో కోకో..

- గిట్టుబాటు దక్కక దిగాలు
- సగానికి పడిపోయిన ధర



చినవెంకన్న అంతరాలయ దర్శనం పునరుద్ధరణ

లోపలి పేజీలో..
ట్రయల్‌రన్ నిర్వహించిన దేవదాయ శాఖ అధికారులు

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. నగర ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్యలు, పందులు, కుక్కల బెడద, వీధి లైట్లు, పార్కుల అపరిశుభ్రత తదితర అంశాలపై సెల్ నెంబరుకు 94408 88786 ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వాటి పరిష్కారానికి మేయర్ చర్యలు తీసుకొంటారు.

మరో అడుగు

పోలవరం నిర్వాసితులకు రూ.1,100 కోట్లు పరిహారం

- పునరావాసం, కోల్పోయిన ఇళ్లకు విడుదల చేసిన ప్రభుత్వం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఒక్కొక్క అడ్డంకిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఓ వైపు శరవేగంగా పనులు చేయిస్తూనే.. మరోవైపు నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం బకాయిలను క్లియర్ చేయిస్తోంది. తాజాగా రూ.1,100 కోట్లు విడుదల చేసి మరో అడుగు ముందుకు వేసింది.



కుక్కునూరు/వేలేరుపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు లెవెల్‌లో వున్న నిర్వాసితులకు పునరావాస, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం ప్యాకేజీని వారి ఖాతాల్లో జమ చేయడానికి ప్రభుత్వం రూ.1,100 కోట్లు విడుదల చేసింది. దీనిపై కుక్కునూరు, వేలేరుపాడు, దేవీపట్నం మండలాల్లోని నిర్వాసితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది జనవరిలో కుక్కునూరు ఏ-బ్లాక్, గొమ్ముగూడెం, సీతారామపురం, కివ్వాక, చీరవల్లి, దామరచర్ల, భువనగిరి, గుంపెనపల్లి గ్రామాల్లోని నిర్వాసితులకు, వేలేరుపాడు, దేవీపట్నం మండలాల్లోని పలు గ్రామాల నిర్వాసితులకు రూ.1,000 కోట్ల వరకు వారి ఖాతాల్లో జమచేశారు. నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస, కోల్పోతున్న ఇళ్లకు పరిహారం, పునరావాస కాలనీల్లో ఇళ్ల, స్థలం వద్దనుకున్న వారికి పరిహారం చెల్లించారు. కుక్కునూరు, కివ్వాక గ్రామాల్లో 250 మంది నిర్వాసితుల ఇళ్లకు పెండింగ్‌లో ఉంది. మిగిలిన గ్రామాల్లోను వందలాది మందికి జమకాలేదు. జనవరి నుంచి పెండింగ్ పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25 గ్రామాల్లోని నిర్వాసితుల ఖాతాల్లో జమ కావడం ప్రారంభమైంది.

41.15 కాంటూరు పరిధిలో రూ.2,500 కోట్లు నిర్వాసితులకు చెల్లించాల్సి ఉండగా జనవరిలో కొంత మేర నిధులు విడుదల చేయడంతో వేలేరుపాడు మండలంలో అక్కడక్కడ సొమ్ములు జమయ్యాయి. ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి (మిగతా 6వ పేజీలో)

న్యాయం చేస్తున్న ప్రభుత్వం



ఈ ఏడాది జనవరిలో రూ.1,000 కోట్ల పరిహారం పోలవరం నిర్వాసితులకు ఖాతాల్లో జమ చేసింది. మరలా ఇప్పుడు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు నిధులు విడుదల చేసింది. కివ్వాకలో దాదాపు 120 మంది ఇళ్లకు పరిహారం ఇప్పటి వరకు అందలేదు. నిధులు విడుదల కావడంతో పరిహారం అందుతుందని సంతోషంగా ఉన్నాం.

- మంత్రి గోపాలకృష్ణ, నిర్వాసితుడు, కివ్వాక

పూర్తిగా అందని పరిహారం



జనవరిలో చెల్లించిన పరిహారంలో ఇంటికి నష్ట పరిహారం, మా కుమార్తె ఆర్అండ్ఆర్ ప్యాకేజీ జమ కాలేదు. దీనిపై అధికారులు కలిస్తే బిల్లులు వెనక్కి వచ్చాయని సరిచేసి మళ్లీ పెడతామన్నారు.

- కొప్పర్తి శంకర్, వేలేరుపాడు



నాకు ఆర్అండ్ఆర్ పరిహారాన్ని మాత్రమే అధికారులు చెల్లించారు. గృహ పరిహారం పెండింగులో ఉంది. అధికారులు మళ్లీ బిల్లు పెడతామన్నారు. తాజాగా పరిహారం అందుతుందని ఆశిస్తున్నా.

- అత్తిలి వెంకన్న, వేలేరుపాడు



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ఊరట

- కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట లభిస్తుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తూ జిల్లా ట్రాన్స్‌పోర్టు కార్యాలయ ఆధ్వర్యంలో గురువారం పోలీసు పెట్రోల్ బంకు నుంచి పాతబస్టాండ్ వరకు ఆటోలు, మాక్సీక్యాబ్‌లు, మోటారు క్యాబ్‌లు, చిన్న కార్లతో చేపట్టిన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలపై అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనరు నాగార్జునరావు, నగరపాలక కమిషనర్ భాను ప్రతాప్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనరు జి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశాలకు 12,345 ఇళ్లను సిద్ధం చేయండి

ఏలూరుసిటీ : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల చివరి నాటికి రాష్ట్రంలో మూడు లక్షల ఇళ్ళను సామూహిక గృహ ప్రవేశాలకు సన్నాహాలు చేస్తోందని, జిల్లాలో 12,345 ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలంటూ కలెక్టర్ కె.వెట్రిసెల్వి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్ట రేట్‌లో గురువారం జిల్లాలో గృహ నిర్మాణాత ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యం 12,345 కాగా ఇప్పటి వరకు 10,565 ఇళ్ళు పూర్తి చేశారని, మిగిలిన 1780 ఇళ్ల పూర్తి చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో 403 ఇళ్లను పూర్తి చేసి, మిగిలిన ఇళ్లను ఈనెల చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశానికి హాజరుకాని ఐదుగురు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని గృహనిర్మాణ శాఖ పీడీ జి.సత్యనారాయణను ఆదేశించారు. ఈనెల 18వ తేదీ హౌసింగ్ డే (ప్రేరణ) రోజున లబ్ధిదారులతో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు.

ఇద్దరిలో ఎవరు?

- టీడీపీ అధ్యక్షుడి ఎంపిక దిశగా చర్యలు .. ఐవీఆర్ఎస్ సర్వే
- పరిశీలనలో గన్నితో పాటు వీరమల్లు పేరు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి తేల్చే పనిని టీడీపీ అధిష్ఠానం వేగవంతం చేసింది. ఇద్దరు పేర్లతో తాజాగా ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా అధ్యక్ష పదవిని కట్టబెట్టేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో ప్రధానంగా ప్రస్తుత అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో పాటు కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావుల పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వేను టీడీపీ చేపట్టింది. రెండు రోజులుగా ఈ సర్వేను విస్తృతంగా జరుపుతోంది. ఈ ఇద్దరిలో ఎవరైతే మీ కిష్టం అంటూ మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ఇతర ముఖ్యనేతలను 700 మందికి పైగా ఐవీఆర్ఎస్ సర్వేను పూర్తి చేశారు. దీంతో అధ్యక్ష పదవికి దీపావళి తర్వాత ముహూర్తం ఖరారు చేసే యోచనలో ఉన్నట్టు సమాచారం.

అనూహ్యంగా తెరపైకి..

తాజాగా ఈ పదవికి ఇప్పటి వరకు దరఖాస్తు చేయని కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. గౌడ సామాజిక వర్గానికి చెందిన నేతగా టీడీపీకి చాలా కాలం నుంచి సేవలందిస్తున్న వీరమల్లు ముదినేపల్లి ఎంపీపీగా పనిచేసిన అనుభవం ఉంది. జూలైలో జిల్లా పరిశీలకులు ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానించగా ఐదుగురి పేర్లు పరిశీలనలో నిలిచాయి. వారిలో గన్ని వీరాంజనేయులు, ఘంటా రామకృష్ణ, పెనుమర్తి రామ్‌కుమార్, శ్యామ్‌చంద్రశేషు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి)లు ఉన్నారు. చివరకు జాబితాలో గన్ని పేరు ఉంచగా తాజాగా వీరమల్లు పేరునుపరిశీలన జరపడం పార్టీ ఎత్తుగడగానే విశ్లేషకులు భావిస్తున్నారు.

కొల్లేరులో ఆక్రమిత చెరువు ధ్వంసం


నత్తగుల్లపాడులో కొల్లేరు అభయారణ్య పరిధిలో ఆక్రమిత చెరువు గట్లను ధ్వంసం చేస్తున్న అటవీశాఖ అధికారులు

కైకలూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొల్లేరు అభయారణ్య పరిధిలో ఆక్రమిత చెరువును గురువారం అటవీశాఖ అధికారులు ధ్వంసం చేశారు. కైకలూరు మండలం నత్తగుల్లపాడు గ్రామ సరిహద్దును ఆనుకుని ఉన్న ఐదెకరాల చెరువుపై వైసీపీ సర్పంచ్ ముంగర రామకృష్ణంరాజు ఇటీవల రాజమండ్రిలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఇటీవల అధికారులు సర్వే నిర్వహించి రెండెకరాలు కొల్లేరు అభయా రణ్య భూమి ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు చెరువును ధ్వంసం చేసేందుకు అటవీశాఖ అధికారులు పెద్దఎత్తున గ్రామంలోకి రావడంతో గ్రామస్థులు భారీగా చేరుకుని గ్రామ అవసరాలకు వినియోగించుకునే చెరువు అని, అందులో చేపలు ఉన్నాయని మొరపెట్టుకున్నా వారు పట్టించుకోలేదు. నిబంధనల మేరకు కైకలూరు అటవీశాఖ రేంజర్ రామలింగాచారి ఆధ్వర్యంలో గట్లను ధ్వంసం చేశారు. గ్రామస్థులు చెరువులోని చేప లు బయటకు వెళ్లకుండా వలలను అడ్డుకట్ట వేసు కుని కాపాడుకునే ప్రయత్నం చేశారు. రేంజర్ మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్య భూమి ఎవరైనా ఆక్రమించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ముగ్గురికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి


హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లతో ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వారిలో సీనియార్టీని బట్టి ముగ్గురికి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పిస్తూ ఎస్పీ కేపీఎస్ కిశోర్ గురువారం వారికి హెడ్‌కానిస్టేబుల్ బ్యాడ్జీలను, ఉత్తర్వులను ఇచ్చి అభినందించారు. హెడ్‌కానిస్టేబుళ్లగా పదోన్నతి పొందిన కె.రాంబాబు, వై.మనోహర్, ఎన్‌వీవీ కుమార్‌లను అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారంటే కేసుల దర్యాప్తు అధికారులుగా బాధ్యతలు ఉంటాయని ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు.

కొండవాగుల్లోని రాళ్లు తొలగింపు



బుట్టాయగూడెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గుబ్బల మంగమ్మ ఆలయానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయానికి వెళ్లే రహదారిలో ఉన్న కొండవాగుల్లోని రాళ్లను ఆలయ కమిటీవారు, కూలీలు తొలగించారు. ఇటీవల ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు బండరాళ్లు వాగుల్లో చేరి ప్రయాణాలకు అడ్డంకిగా మారాయి. వాహనాలకు అడ్డంకిగా ఉన్న రాళ్లను తొలగించి రహదారిని బాగుచేశారు.

ఆలయానికి వెళ్లే దారిలోని వాగులోని రాళ్ళను తొలగిస్తున్న దృశ్యం

'సెలవు రోజుల్లోను రిజిస్ట్రేషన్లు'

ఏలూరు,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించే క్రమంలో ఇప్పటికే అమలులో ఉన్న సెలవు దినాల్లో రిజిస్ట్రేషన్ సేవలను జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేవారు రూ.ఐదు వేలు ప్రత్యేక రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని, ముందుగానే ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని, అవసరమైన పత్రాలతో కార్యాలయానికి హాజరు కావాలన్నారు.

రుణ బకాయిలు రూ.15.23 కోట్లు

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి



చింతలపూడి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 581 మందికి 2015 నుంచి 2018 వరకు రుణాలు ఇవ్వగా, వీరి బకాయిలు రూ.15.23 కోట్లు ఉన్నాయని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ఎస్సీ కార్పొరేషన్లకు టార్గెట్‌లు ఇచ్చారని, ఇందులో భాగంగా జిల్లాకు ప్రతీనెలా రూ.63.46 లక్షలు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టారన్నారు. చింతలపూడి మండలంలో 13 కార్లకు రూ.83.16 లక్షలు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం కింద 38 మందికి రుణాలు ఇవ్వగా రూ.51.98 లక్షలు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రుణాలు కడితే కొత్తవారికి రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వందే భారత్ పట్టాలెక్కేది ఎప్పుడు ?

నరసాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):నరసాపురం- చెన్నై మధ్య కొత్తగా ప్రవేశపెట్టే వందేభారత్ రైలుపై ఇంకా సస్పెన్స్ వీడలేదు. ప్రస్తుతం విజయవాడ- చెన్నై మధ్య నడుస్తున్న ఈ రైలును నరసాపురం వరకు పొడిగించాలని కేంద్ర మంత్రి వర్మ రైల్వే మంత్రి, బోర్డును కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి గత నెలలో క్లియరెన్స్ వచ్చింది. ఎప్పటి నుంచి అనే దానిపై ఎలాంటి ప్రకటన వెలువడలేదు. చాలా మంది దసరా నుంచే ఈ రైలు పట్టాలు ఎక్కుతుందని భావించారు. దీపావళి వస్తున్నా క్లారిటీ రాలేదు. రైల్వే అధికారులకు ఫోన్ చేసి ఈ రైలు గురించి ఆరా తీస్తున్నప్పటికి వారి నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదు. దీనిపై ఈ ప్రాంతవాసులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.



మావుళ్ళమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

సోమేశ్వర, మావుళ్లమ్మ ఆలయాల్లో ప్లాస్టిక్ నిషేధంపై చర్యలు

భీమవరం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రముఖ దేవాలయాలు అయిన మావుళ్ళమ్మ , పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయం వద్ద ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వాడకంపై నిషేధాన్ని సంబంధిత అలయ అధికారులు కఠినంగానే అమలు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్లాస్టిక్ వినియోగంపై కఠినంగా వ్యవహరించడంతో పాటు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చెయ్యటంతో ఆలయాల వద్ద ప్లాస్టిక్ నిషేధంపై భక్తులకు అవగాహన కల్పించే విధంగా బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న షాపుల్లో మాత్రం కవర్లతోనే పూజా సామాగ్రి అందిస్తున్నారు. అటువంటి షాపులపై దేవస్థానం అధికారులు , మునిసిపల్ అధికారులు దృష్టి పెట్టకపోవడంతో బహిరంగంగానే కనిపిస్తున్నాయి. రానున్న కార్తీకమాసంలో వీటిని అరికట్టేలా ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

ప్లాస్టిక్.. పరేషాన్

మాటల వరకే నిషేధం.. అమలులో శూన్యం

- చిన్న తిరుపతి టెంపుల్ టౌన్‌లో విచ్చలవిడిగా వాడకం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- దాడులు లేవు.. జరిమానాలు లేవు

ప్రజల బాధ్యతారాహిత్యం.. అధికారుల చిత్తశుద్ధి లోపం వెరసి చిన్న తిరుపతిగా ఖ్యాతిగాంచిన ద్వారకాతిరుమల క్షేత్ర పరిధిలో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా సాగుతోంది. ఓ వైపు ముఖ్యమంత్రి నుంచి జిల్లా కలెక్టర్ వరకు దీనిపై విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నా క్షేత్ర స్థాయి అధికారులు మాత్రం నిషేధాన్ని అమలు చేయడంలో విఫలమవుతున్నారు. ఉదాహరణకు టెంపుల్ టౌన్‌గా ఉన్న గ్రామంలో రహదారిపై బహిరంగంగా ప్లాస్టిక్ సంచులతో అమ్మకాలు సాగిస్తున్నారు. కొండపైన దేవస్థానం షాపులలోను ప్లాస్టిక్ సంచుల వినియోగం జరుగుతోంది.

(ద్వారకాతిరుమల-ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెనుభూతంలా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లపై ప్రభుత్వం విధించిన నిషేధం 2022 జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది. ఇటీవల సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో భాగంగా ప్రతీ నెలా అవేర్‌నెస్ కల్పిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా గ్రామంతోపాటు క్షేత్ర పరిసరాల్లో యథేచ్ఛగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు.


ద్వారకాతిరుమలలో రోడ్లపైన నిమ్మకాయలు కవర్లలో వేసి విక్రయిస్తున్నారు.. అలాగే ప్రసాదాలకు, దుకాణాల్లోనూ ఇదే పరిస్థితి

ఇటీవల శ్రీవారి క్షేత్రంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలులోకి తీసుకుని వచ్చారు. దుకాణదారులకు హెచ్చరికలు చేశారు. తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు. కొన్నిరోజులు ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం కనిపించలేదు. కాని కొద్ది రోజులు మళ్లీ విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం చాలా మంది భక్తుల



చేతుల్లో క్యారీ బ్యాగ్‌లు కనిపిస్తోంది. కొండపై దాదాపు అన్ని దుకాణాల్లోనూ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, బాటిల్స్ కొండ దిగువన చిరు వ్యాపారులు పండ్లు, నిమ్మకాయలు, జామకాయలు వంటి వాటిని ఈ కవర్ల ద్వారానే విక్రయిస్తున్నారు. అప్పుటప్పుడు జిల్లా కేంద్రం నుంచి వచ్చే అధికారులు కొండపై తనిఖీలు చేపడతారు. అధికారులు వచ్చిన సమాచారం తెలుసుకున్న దుకాణదారులు కవర్లను దాచేసి వారు వెళ్లిన తర్వాత వినియోగంలోకి తేవడం పరిపాటిగా మారింది.

వాడకూడనివి ఇవే


కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల నిబంధనల ప్రకారం అలంకరణ కోసం వాడే థర్మోకోల్, స్వీట్‌బాక్స్‌లు, ఆహ్వాన పత్రికలు, ఇయర్‌బడ్స్ ప్లాస్టిక్ జెండాలు, ఐస్‌క్రీం పుల్లలు, ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, చెంచాలు, కవర్లు, బ్యానర్లు తదితరాలు వాడకూడదు.

ప్రత్యామ్నాయాలివే

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు బదులుగా సేంద్రీయ పత్తి, వెదురు, చెక్క, మట్టి, పింగాణి, త్వరగా ప్రకృతిలో కలసిపోయే ప్లాస్టిక్‌తో తయారైన వస్తువులు వాడాలి. మట్టి, పింగాణి పాత్రలను ఆహారం నిల్వ చేసేందుకు వాడవచ్చు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు సాధ్యమేనా అన్నది వేచి చూడాల్సి ఉంది.

కోకో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.. చాక్లెట్ల తయారీలో కీలకమైన కోకో సాగులో ఉమ్మడి జిల్లా రైతులు నాణ్యమైన పంట పండిస్తున్నప్పటికీ గిట్టుబాటు ధర అందక దిక్కులు చూస్తున్నారు.. అంతర్జాతీయ ధరలతో పోలిస్తే మన రైతులు కిలోకు రూ.300 నష్టపోతున్నారు.. ఒకప్పుడు కిలో రూ.1000 దాటిన ధర నేడు సగానికి పడిపోయింది.. దళారుల ధరల మాయాజాలంతో రైతులు చిత్తవుతున్నారు..

కష్టాల్లో కోకో..





- గిట్టుబాటు దక్కక దిగాలు
- సగానికి పడిపోయిన ధర
- ప్రభుత్వ ప్రోత్సాహకం నిలిపివేత
- దిక్కుతోచని కోకో రైతులు

(దెందులూరు -ఆంధ్రజ్యోతి) ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అత్యధికంగా రెతులు కోకో సాగు చేస్తున్నారు. జిల్లాలో 36,400 ఎక రాల్లో కోకో పంట వేశారు. పెదవేగి, దెందులూరు, ద్వారకాతిరుమల, నూజివీడు, ముసునూరు , భీమడోలు మండలా లతో పాటు డెల్టా ప్రాంతంలోని పలు మండ లాల్లో వాణిజ్య పంటగా కోకో విస్తరించింది. పామాయిల్, కొబ్బరి, అరటి తోటల్లో అంతర పంటగా పండిస్తున్నారు. ప్రారంభంలో కేజీ కోకో గింజల ధర రూ.100 ఉండేది. క్రమంగా రూ.250 వరకూ పెరిగింది. 2023 ప్రారం భంలో కేజీ రూ.1060 పలకడంతో రైతులు పూర్తి స్థాయిలో కోకో పంటలపై ఆసక్తి చూపారు. కౌలుకు తీసుకునేందుకు ఎగబడటంతో కౌలు ధరలు పెరిగాయి. తర్వాత ధర అమాంతం పడిపోయింది. రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. కోకో కంపెనీలతో ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రి మాట్లాడారు. కేజీకి రూ.50 ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చేవిధంగా రూ.500 మద్దతు ధర కల్పించారు. తర్వాత ప్రభుత్వం ప్రోత్సాహకం నిలుపుదల చేసింది. కంపెనీలు దొరికిందే ఛాన్స్‌గా కేజీకి రూ.300 నుంచి రూ.340 వరకు రైతులకు చెల్లిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నాయి. దేశ వ్యాప్తంగా కోకో పంటకు లక్ష టన్నులకు డిమాండ్ ఉండగా మన జిల్లాలోనే 12 నుంచి 13 వేల టన్నుల వరకూ ఉత్పత్తి అవుతోంది. మిగిలిన వాటిని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కోకో పంటకు మరో 30 సంవత్సరాల వరకూ డిమాండ్ కొనసాగనుంది. కానీ మద్దతు ధర లేక పోతే రైతు తీవ్రంగా నష్టాలను చూస్తున్నాడు. కోకో పంటల వేసిన తరువాత అవసరమైన స్థాయిలో నీరు అందిస్తూ చీడ పీడలకు మందులు పిచికారీ చేస్తూ కష్టనష్టాల కోర్చి కోకో మొక్కలను పెంచుతున్నారు. సంవత్సరానికి ఎకరానికి 20 నుంచి 30 వేలు పెట్టుబడి పెడితే దాదాపు ఎకరానికి కోకో పంటకు రూ.50 వేల నుంచి లక్ష వరకూ ఆదాయం వస్తుంది. దీంతో రైతులు పెద్ద స్థాయిలో ఆసక్తి చూపించారు. కానీ ధర లేకపోవడంతో ఎకరానికి రూ.20 నుంచి రూ.30 వేలు నష్ట పోతున్నారు

కోకో హబ్‌గా ఏలూరు జిల్లా

మనం పండించిన కోకో గింజలను చాక్లెట్, కాస్మొటిక్స్ తయారీలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఏలూరు జిల్లా కోకో హబ్‌గా మారింది, 90 శాతం చాక్లెట్స్ తయారీ, 30శాతం కాస్మొటిక్ క్రీమ్‌ల తయారీలో కోకోను ప్రస్తుతం వినియోగిస్తున్నారు. దెందులూరు నియోజక వర్గంలో రైతులు ఎక్కువగా పామాయిల్, అరటి, కొబ్బరి తదితర పంటల్లో అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. పామాయిల్ తోటలో అంతర పంటగా వేస్తే 2 క్వింటాలు దిగుబడి వస్తుం డగా ప్రత్యేకంగా కోకో పంటను మాత్రమే వేస్తే 5 నుంచి 6 క్వింటాల వరకూ దిగుబడి వస్తోంది. శ్రీకా కుళం, విజయ నగరం. అనకాపల్లి విజయవాడ, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలో కూడా కోకో పండి స్తున్నప్పటికీ ఏలూరు జిల్లాలో వాతావరణం అనుకూలంగా ఉండటం కారణంగా నాణ్యమైన పంట పండి స్తున్నారు.

తోటల నుంచే కొనుగోళ్లు

ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ ధర మాత్రం దక్కడం లేదు. త్వరగా అమ్మేయాలని మాయ మాయ మాటలు చెప్పి కొన్ని కంపెనీలు తక్కువ ధరకు కొనుగోలు చేసి కోకో పంటను రైతు అమ్మిన 48 గంటల్లోనే నగదు చెల్లింపులు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో హిందుస్థాన్, క్యాడ్బరీస్, రమ్య ఫ్రూట్స్ కంపెనీ, చిన్నపాటి చాక్లెట్ కంపెనీలు కోకో గింజలను ఏజెంట్‌ల ద్వారా కొనుగోలు చేస్తున్నాయి. కోకో కాయలను చెట్టు నుంచి కోసిన తర్వాత కోకో గింజలను తీసి నాలుగు నుంచి ఆరు రోజుల పాటు అరబెట్టి రైతులు కంపెనీలకు విక్రయిస్తున్నారు..

పలు కంపెనీలు బ్రాంచ్‌లు

కోకో గింజలను సేకరించేందుకు పలు కంపెనీలు ఇప్పటికే గంగన్నగూడెంలో క్యాడ్‌బరీతో పాటు మరికొన్ని కంపెనీలు దెందులూరు, సోమవర ప్పాడు, చొదిమేళ్ల ఏలూరు తదితర ప్రాంతాల్లో బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకుని కోకో గింజలను కొనుగోలు చేస్తున్నాయి. కొంతమంది కమీషన్ ఏజెంట్‌లు సైతం కోకో పంటలను రైతుల వద్దకు వెళ్లి నేరుగా పంటలను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పంట బాగుండటం లాభాలు తక్కువగా వస్తుండటం కొన్ని సార్లు నష్టాలు వస్తుండటంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు

కిలోకి రూ.900 తగ్గకుండా చూడాలి



నాణ్యమైన కోకో పంటను పండిస్తున్నందున కొంత మంది కమీషన్ ఏజెంట్‌లు కోకో గింజల ధర కృతిమ ధర సృష్టిస్తూ తగ్గిస్తున్నారు. రైతు నష్టపోకుండా ధరలపై ప్రభుత్వ పర్యవేక్షణ చేయాలి. రైతులను కంపెనీలు మోసం చేయకుండా పర్యవేక్షణ చేయాలి. అంతర్జాతీయ ధర రైతలకు కల్పించాలి. కనీసం కేజీకి రూ.900 ధర అందించాలి.

- కె.శ్రీనివాస్, ఏపీ కోకో రైతు సంఘం నాయకుడు


ఉండి మత్స్య పరిశోధన కేంద్రంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు,ఫిషరీస్ విద్యార్థులు

రొయ్యల సాగులో మేతకే ప్రాధాన్యం

ఉండి మత్స్యపరిశోధన కేంద్రం హెడ్ డాక్టర్ చంద్రశేఖరరావు

ఉండి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రొయ్యలసాగులో మేతల తయారీ ఎంతో ప్రాముఖ్యమైనదని ఉండి మత్స్యపరిశోధన కేంద్రం హెడ్ డాక్టర్ చంద్రశేఖరరావు అన్నారు. గురువారం ఉండి మత్స్య పరిశోధన కేంద్రంలో ఏడురోజుల శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఆక్వా రైతులకు, ఫిషరీస్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ రంగాచార్యులు మాట్లాడుతూ రొయ్యల సాగులో మేత ఎంతో ప్రాధాన్యమైనదన్నారు. ఆక్వా రైతులు దీనిని దృష్టిలో పెట్టుకుని సాగు చేయాలన్నారు. ఉండి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ మేత ఖర్చులు తగ్గించుకోవడంపై పరిశోధనల గురించి వివరించారు. మాట్లాడుతూ మేత తయారీ వాటి నాణ్యతను గుర్తించి శిక్షణలో మెళుకువలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు.రొయ్యల పెంపకంలో మేత ఖర్చు 60 శాతంపైబడి వుంటుందన్నారు. ముత్తుకూరు ఆక్వాకల్చర్ హెడ్ డాక్టర్ ఆనంద్‌ప్రసాద్, కేవీకే ఫిషరీస్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరావు, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరక్టరు రాంబాబు, ఉండి మత్స్యపరిశోధన కేంద్రం హెడ్ డాక్టర్ చంద్రశేఖరరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ శివకుమార్, భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలతో ప్రయోజనం





సిరి, హసిని ప్రియ, బీఎస్సీ విద్యార్థినులు, కేజీఆర్ఎల్ కళాశాల, భీమవరం

శాస్త్రవేత్తలు సూచనలతో అవగాహన చేసుకుంటున్నాం. రొయ్యల సాగులో మెళకువలు,మేతల యాజమాన్యం గురించి తెలుసు కుంటున్నాం. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయి. మత్స్య పరిశోధన కేంద్రానికి రావడం వల్ల పలు విషయాలపై అవగాహన చేసుకున్నాం.అవగాహన, శిక్షణా కార్యక్రమాల వల్ల ఎంతో ఉపయోగకరంగా వుంటుంది.

ఆర్థికాభివృద్ధిలో ఆక్వా రంగం కీలకం

తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆక్వాపై జాతీయ సదస్సు

తణుకు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగం రాష్టాభివృద్ధికి వెన్నుముక లాంటిదని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిల్ కుమార్ అన్నారు. గురువారం ఎస్‌సీఐఎం డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆక్వా ఎంటర్ ప్రెన్యూర్‌షిప్- వికసిత ఆంధ్రప్రదేశ్ కోసం అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లా డుతూ ఆక్వారంగం అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడాలంటే సాంకేతికత, పరిశోధన, మార్కెటింగ్‌లో ఆవిష్కరణాత్మక మార్పులు అవసరం అన్నారు. విద్యార్థులు, యువ వ్యాపారవేత్తలు ఆవిష్కరణ దిశగా ఆలోచించాలని సూచించారు. ప్రొఫెసర్ జె.చంద్రప్రసాద్ మాట్లాడుతూ స్థిరమైన ఉత్పత్తి పద్ధతులు మాత్రమే దీర్ఘకాలిక ఆర్థికాబివృద్ధికి దోహదం చేస్తాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలో కొత్త ఆలోచనలు, వ్యాపార పద్ధతులను నేర్చుకోవాలని చెప్పారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ ఐవీ నారాయణ మాట్లాడుతూ ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వ విధానాలు, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, రైతులు అనుభవం అన్నీ కలిసి రావాలన్నారు. సదస్సులో సావనీర్‌లు ఆవిష్కరించారు. యోగివేమన యూనివర్శిటీ ప్రొఫెసర్ జి. విజయభారతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సావనీర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం



శిథిలావస్థలో కొత్తపాడు పశు వైద్యశాల

ఇరగవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వైద్యశాలలు నేడు శిథిలావస్థకు చేరాయి. ఇరగవరం మండలం కొత్తపాడు వైద్యశాలను 1984లో నిర్మించారు. ఈ వైద్యశాలను అయినపర్రు, కంతేరు, కొత్తపాడు, ఓగిడి తదితర గ్రామ ప్రజలు వినియోగించుకుంటారు. వైద్యశాల శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బిక్కు బిక్కుమంటూ సేవలందిస్తున్నారు. ఏళ్ల నాటి భవనం కావడంతో గోడలు బీటలు వారి చెమ్మగిల్లి ఎప్పుడు కూలిపోతాయో అన్నట్లు ఉన్నాయి. మరోపక్క కనీస సదుపాయాలు లేకపోవడంతో పాడి రైతులకు అవస్థలు తప్పడం లేదు. పశువైద్యశాలలో ల్యాబ్‌లు లేకపోవడంతో పాడి రైతులు తణుకు పాలిక్లినిక్‌కు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పాడి రైతులు కోరుతున్నారు.


ఈఎస్ఐ హాస్పిటల్ సమీపంలో మురుగు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు


తంగెళ్లమూడి లక్ష్మి నగర్‌లో ఇళ్ల మధ్య మురుగు


లక్ష్మి నగర్‌లో మురుగు, వర్షం నీటితో మునిగిన రహదారి

ముక్కు మూసుకోవాల్సిందే

జిల్లా కేంద్రమైన ఏలూరు నగరం మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడంతో మురుగు పారక నిలిచిపోతోంది. దుర్గంధంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. వర్షానికి మురుగు రోడ్లు, ఇళ్ల ముందు చేరుతోంది. మోతేవారి చెరువు - మాదేపల్లి రోడ్డులో డ్రెయిన్, ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద, పత్తేబాద రైతు బజార్ వద్ద డ్రెయిన్లలో చెత్త పేరుకుపోయి మురుగు పారడం లేదు. లక్ష్మీ నగర్‌లో ఖాళీ స్థలాల మధ్య చెత్త, కంపలతో నీరు నిలిచిపోతోంది.

- ఫొటోగ్రాఫర్, ఏలూరు


పత్తేబాద రైతు బజార్ వద్ద డ్రెయిన్‌లో కదలని మురుగు


మోతేవారిచెరువు-మాదేపల్లి రోడ్డులో మురుగు డ్రెయిన్‌లో చెత్త



ఘనంగా లక్షతులసి పూజ

వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏడవ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత మండపంలో వివిధ రకాల ఫలపుష్పాలతో అలంకరించిన మండపంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టకలసారాధన, స్నపనము తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రప్రచారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు లక్షతులసి పూజ కన్నుల పండువగా నిర్వహించారు. అంతరాలయంలో తిరుప్పావడ సేవ నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు గజవాహనంపై అధిరోహించి తిరువీధులలో విహరించారు. కళాకారుల ప్రదర్శనలు అలరించాయి.

చినవెంకన్న అంతరాలయ దర్శనం పునరుద్ధరణ

ట్రయల్‌రన్ నిర్వహించిన దేవదాయ శాఖ అధికారులు

కొద్దిరోజుల్లో రానున్న స్పష్టత



ఆగమ విరుద్ధంగా నిర్మించారంటూ ఫిర్యాదు చేసిన క్యూలైన్ మండపం ఇదే..

ద్వారకాతిరుమల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయంలో కొన్ని సేవలను పునరుద్ధరించాలని అలాగే దర్శనం క్యూలైన్ల నిర్మాణం అప్రదక్షిణంగా జరగడం ఆగమ శాస్త్ర విరుద్ధమని ఏలూరుకు చెందిన సోషల్ వర్కర్, న్యాయవాది బీకెఎస్ఆర్ అయ్యంగార్ దేవదాయశాఖ కమి షనర్‌కు ఫిర్యాదు చేశారు. అప్రదక్షిణ క్యూలైన్ల నిర్మాణంతో పాటు అంతరాలయ దర్శన పునరుద్ధరణ, స్థానాచార్యుల నియామకం, స్వామివారికి వినియోగించిన పుష్పాలతో అగరు బత్తి తయారీ ఆగమశాస్త్ర విరుద్ధమని, కుచ్చులమెట్లపై ఉత్సవాన్ని, పొన్నచెట్టు వాహనసేవ పునరుద్ధరించాలని ఫిర్యాదులో కోరారు. దీనిపై దేవదాయ కమిషనర్ ఇక్కడి ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తిని విచారణ అధికారిగా నియమించి పూర్తి నివేదికను పంపాలని ఆదేశించారు. దీంతో దీనిపై కదలిక ప్రారంభమైంది.ఐదేళ్లక్రితం కొవిడ్ సమయంలో నిలిపివేసిన అంతరాలయ దర్శనం, అమ్మవార్ల సాధారణ దర్శన సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆలయంలో గతంలో ఉన్నట్లుగానే స్వామివారితో పాటు అలివేలు మంగ, ఆండాళ్ అమ్మ వార్లను సాధారణ భక్తులు దర్శించుకునేలా చర్యలకు రంగం సిద్ధమైంది. గురువారం దీనిపై ట్రయల్‌రన్ నిర్వహించారు. గతంలో వలె ఆలయ అంత రాలయ ముందు భాగంలో అమ్మవార్ల ముందు చెక్కలతో నిర్మించిన ర్యాంపును ఏర్పాటు చేసి చూశారు. కొత్తవి చేయించాలా వీటినే మరమ్మతు చేసి విని యోగించాలా అన్నదానిపై ఈవో మూర్తి ఇతర అధికారులతో చర్చించారు. ఇదిలా ఉంటే తాజాగా అధికారులు అంతరాలయ దర్శనానికి రూ.500 టికెట్టును ఖరారు చేసి దేవదాయ కమిషనర్ అనుమతిని పొందారు.



పోటీల్లో రజిత పతకం సాధించిన బాలలను అభినందిస్తున్న హోమ్ సూపరింటెండెంట్ శ్రీవల్లి, చెస్ కోచ్ లక్ష్మణరావు

అంతర్జాతీయ ఆన్‌లైన్ చెస్‌లో ఏలూరు బాలల ప్రతిభ

ఏలూరు క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :అంతర్జాతీయ ఆన్‌లైన్ చెస్ ఛాంపియన్ షిప్ - 2025లో ఏలూరు శనివారపు పేట ప్రభుత్వ బాలుర వసతి గృహానికి చెందిన నలుగురు బాలలు పాల్గొని రజిత పతకాలు సాధించారు. ఈనెల 14వ తేదీ నుంచి 16వ తేదీ రాత్రి 9 గంటల వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 30 దేశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించగా ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు సంబంధించి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పుసుపులేటి తిమ్మప్ప, సెషన్ ఆఫీసర్ వడ్డే శ్రీనివాస్‌లు ఆర్గనైజర్లుగా వ్యవహరించారు. బాలలను హోమ్ సూపరింటెండెంట్ శ్రీవల్లి, కోచ్ లక్ష్మణరావు అభినందించారు.

విధుల్లో చేరాలని పీహెచ్‌సీ వైద్యులకు నోటీసులు?

భీమవరంటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) :తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో పాల్గొన్న వైద్యులు వెంటనే విధుల్లోకి హాజరుకావాలని జిల్లా వైద్యాధికారులు నోటీసులను జారీ చేస్తున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి గురువారం నోటీసులు జారీ చేవారు. కొన్ని రోజులుగా వైద్యులు విధులకు దూరంగా ఉంటున్నారు.వెంటనే విధులకు హాజరు కావాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

పాతాళంలో ఉన్నా కొట్టేస్తారు..!

మొగల్తూరులో భూమిలో ఉన్న నెట్ వర్క్ కేబుల్ వైర్లు అపహరణ



కట్ చేసిన నెట్‌వర్క్ కేబుల్ వైర్లు..తవ్వకాల్లో పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న కుళాయి నీరు ↓



మొగల్తూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రధాన కూడలి రహదారి వెంబడి వివిధ సెల్ నెట్‌వర్క్ కంపెనీలు భూ మార్గం ద్వారా నడిపిన కేబుల్ వైర్లను దొంగలు తవ్వేసి లాక్కుపోతున్నారు. మొగల్తూరు యూనియన్ బ్యాంకు సమీపంలో భూ మార్గం ద్వారా బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, ఐడియా, రిలయన్స్ వంటి నెట్‌వర్క్ కంపెనీలు వారి టవర్లకు అనుసంధానం చేస్తూ భూ మార్గం ద్వారా (సుమారు ఐదు అడుగులు భూమి లోతు తవ్వి) కేబుల్ లైన్‌లు విస్తరించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో మొగల్తూరు ప్రధాన రహదారి యూనియన్ బ్యాంకు సమీపంలో వివిధ నెట్ వర్క్‌లకు సంబంధించిన కేబుల్ వైర్లు దొంగలు తవ్వుకుపోయారు. ఈ వైర్లు తవ్వే క్రమంలో కేబుల్ లైన్‌ను అనుకుని ఉన్న గ్రామ పంచాయతీ మంచినీటి సరఫరా పైప్‌లైన్‌లు విరిగిపోయాయి. గురువారం మంచినీటి సరఫరా చేసే క్రమంలో పైప్‌లైన్ లీకై వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోయింది. విషయాన్ని పరిశీలించిన పంచాయతీ తాగునీటి సరఫరా సిబ్బంది నెట్‌వర్క్ కంపెనీలకు సమాచారం ఇచ్చారు. ఇలాంటి సంఘటనలు ఇటీవల జిల్లాలో మార్టేరు, పెనుగొండ, ఆచంట వంటి ప్రాంతాల్లో జరిగాయని తమ కంపెనీల ప్రతినిధుల ద్వారా ఫిర్యాదు చేయనున్నట్టు ఆయా కంపెనీల సిబ్బంది తెలిపారు.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్











నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



సభలో ఉప్పొంగిన దేశభక్తి




సభలో టీడీపీ మహిళా నేతలు







శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



పొలాల వెంబడి పరుగులు

విద్యుత్ రంగంలో ఆవిష్కరణలకు వేదిక



- విశాఖలో హ్యాకథాన్ - అక్టోబరు 22వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు
- ఏపీఈపీడీసీఎల్ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ పి.సాల్మన్‌రాజు

ఏలూరుసిటీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో ఏపీఈపీడీసీఎల్ స్థాపించిన ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, ఏపీ, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'హాక్ ఏపీ-హ్యాక్ దాస్' హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ పి. సాల్మన్‌రాజు గురువారం తెలిపారు. విద్యుత్ రంగానికి సంబంధించిన వాస్తవ సమస్యలకు వినూత్న సాంకేతిక పరిష్కారాలు అందించగల స్టార్టప్ సంస్థలు ఈ హ్యాకథాన్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లకు స్మార్ట్, డేటా ఆధారిత, ఆధునిక సాంకేతిక పరిష్కారాలు కనుగొనడం ఈ హాకథాన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఎంపికైన స్టార్టప్‌లు తమ పరిష్కారాలను రాష్ట్ర విద్యుత్ రంగ ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించే అవకాశం పొందడంతో పాటు, విజేతలకు పైలెట్ ప్రాజెక్టులు, మూడు డిస్కమ్‌లలో పూర్తి స్థాయి ప్రాజెక్టులు అమలు చేసుకునే అవకాశం కల్పించబడతాయని తెలిపారు.

పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలు..

- ప్రమాదాలను ముందుగా గుర్తించే వ్యవస్థ : డ్రోన్ ఆధారిత ఇన్స్పెక్షన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విశ్లేషణల ద్వారా విద్యుత్ మౌలిక సదుపాయాల స్థితిని అంచనా వేసి పరిస్థితి ఆధారిత సంరక్షణ విధానాన్ని ప్రవేశపెట్టడం.
- స్మార్ట్ మీటర్ డేటా విశ్లేషణ ద్వారా ఆదాయ సంరక్షణ: ప్రతి 15 నిమిషాలకు నమోదయ్యే స్మార్ట్ మీటర్ డేటాను విశ్లేషించి విద్యుత్ చౌర్యం, బిల్లింగ్ లోపాలు, రెవెన్యూ లీకేజీలను గుర్తించి పరిష్కారాల అభివృద్ధి.
- ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్ ప్రిడిక్షన్: స్మార్ట్ మీటర్, అవుటేజ్ డేటాను విశ్లేషించిట్రాన్స్‌ఫార్మర్ పనితీరు, లోడింగ్, ఫాల్ట్ ప్యాటర్న్ ఆధారంగా విఫలమయ్యే అవకాశాలను ముందుగానే గుర్తించడం.
- హైటెన్షన్ లైన్లలో ఇన్సులేటర్ వైఫల్యాల గుర్తింపు: థర్మల్, ఆప్టికల్, అల్ట్రావయొలెట్ లేదా అకౌస్టిక్ సెన్సింగ్ పద్ధతుల ద్వారా పగటి, రాత్రి సమయాల్లోను ఇన్సులేటర్ లోపాలను సురక్షితంగా గుర్తించే పరిష్కారాల అభివృద్ధి..

స్టార్టప్‌లకు విశేష అవకాశం: ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్థాపించిన ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ స్టార్టప్‌లకు సహకారవేదికగా వ్యవహరిస్తోందని, సుస్థిర సాంకేతిక అభివృద్ధికి మద్దతు ఇస్తున్న అంతర్జాతీయ సంస్థ క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ కూడా భాగస్వామ్య సంస్థగా ఈ కార్యక్రమంలో పాల్గొంటోందని తెలిపారు. ఈ హ్యాకథాన్ విశాఖపట్నంలో జరగనుందని, రాష్ట్రంలోని మూడు డిస్కంలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. అక్టోబరు 22వ తేదీ రాత్రి 12 గంటల వరకు రిజిస్ట్రేషన్లు అందుబాటులో ఉంటాయని, రాష్ట్రంలోని స్టార్టప్ సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ సాల్మన్‌రాజు కోరారు.

శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యలో రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు కోటదిబ్బ వద్ద ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తియాప్‌పై అవగాహన సదస్సును గురువారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రమ శిక్షణను అలవర్చుకోవాలని అన్నారు. సమాజ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. శక్తియాప్ మహిళల భద్రతకు భరోసా కల్పించేదిగా ఉందని దీనిని పోలీస్‌శాఖ రూపొందించిందన్నారు. ఆపద సమయంలో పోలీసు సహాయం కోసం ఈ యాప్‌ను వినియోగించవచ్చన్నారు. లేదా అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ నుంచి 112కు కాల్ చేస్తే పది నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరుకుంటారన్నారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ప్రయాణించే సమయంలో భద్రత, భరోసా పోలీస్ శాఖ కల్పిస్తుందన్నారు. మహిళల హక్కులు, చట్టాలు పోలీస్ హెల్ప్‌లైన్ల నెంబర్లు అనేకమైన వివరాలు యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్‌ఐ నాగమణిలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు

ముదినేపల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి-గుడివాడ ప్రధాన రహదారిలో పెద పాలపర్రు గ్రామ సమీపంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వడాలి గ్రామానికి చెందిన కాగిత గోపాలం, అతడి భార్య శివపార్వతి మోటార్ సైకిల్‌పై ఈ నెల 12న గుడివాడ నుంచి ఇంటింటికి తిరిగి వస్తుండగా, ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొంది. మోటార్ సైకిల్ నుంచి కిందపడిన ఆమెకు ఎడమ భుజం ఎముక విరుగగా, గోపాలానికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని విజయవాడ ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా, అక్కడి నుంచి గురువారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ముదినేపల్లి పీఎస్ హెచ్‌సీ ఎస్.వి.రామారావు తెలిపారు.

విలేకరులమని చెప్పుకుంటూ దందా!

పెదపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విలేకరులమని చెప్పుకుంటూ వసూళ్ల దందాకు పాల్పడిన ముఠాలో ఒకరిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. చేపల చెరువుల్లో మేత కోసమని అక్రమంగా చికెన్ వ్యర్థాలను కొంత మంది వాహనాల్లో తరలిస్తున్నారు. ఇదే అదునుగా డబ్బులు వసూలు చేసేందుకు హనుమాన్ జంక్షన్ సమీపంలోని ఆరుగొలను వద్ద ఓ ముఠా కాపు కాసింది. ఒక వాహనంలో చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా డబ్బులు వసూలు చేసేందుకు కొందరు ప్రయత్నించగా స్థానికులు ఒకరిని పట్టుకుని పోలీసులకు అప్పగించగా పెదపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం. అయితే ఈ ఘటన ఆరుగొలను ప్రాంతంలో జరిగిందని, పూర్తిస్థాయి విచారణ జరిపి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని పెదపాడు పోలీసులు చెబుతున్నారు. చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నవారి నుంచి విలేకరులమంటూ చెప్పుకుంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలను కట్టిడి చేసేందుకు పోలీసులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మోటారు సైకిళ్ల చోరీ నిందితుల అరెస్ట్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్లో ముగ్గురు దొంగలను అదుపులోకి తీసుకుని రూ.రెండు లక్షల 75వేల నగదు, ఐదు మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రావిపాడులో మోటారు సైకిల్ చోరీ జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు పెంటపాడు ఎస్.ఐ. స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను చిలకంపాడు లాకులు వద్ద పట్టుకుని విచారించగా మోటారు సైకిళ్ల చోరీ, గుడిలో హుండీ కొల్లగొట్టినట్టు అంగీకరించినట్టు సీఐ రవికుమార్ వెల్లడించారు. తణుకుకు చెందిన ర్యాలీ లోకేశ్, మానుపాటి దుర్గాప్రసాద్‌లతో పాటు మరో మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఎస్.ఐ. స్వామి, కానిస్టేబుల్ అనిల్ కుమార్, మోహన్, నవీన్, హోంగార్డ్ వెంకటేశ్వరరావులను సీఐ రవి కుమార్ అభినందించారు.



పేరుపాలెం సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో దాసి రాజు

బీచ్‌లో సందర్శకులకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి : ఆర్డీవో దాసి రాజు

మొగల్తూరు,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో వన సమారాధనకై కేపీపాలెం, పేరుపాలెం సాగర తీరాలకు వచ్చే సంద ర్శకుల కోసం బీచ్ వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు సిద్ధం చేయాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు సూచించారు. గురువారం పేరుపాలెం బీచ్ గెస్ట్‌హౌస్ వద్ద పలు శాఖల అధికారులతో బీచ్‌లో సదుపాయాల కల్పనపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం నెలరోజులపాటు పుణ్యస్నానాలు చేసేందుకు లక్షలాది మంది యాత్రికులు, సందర్శకులు వచ్చే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదుల నిర్మాణంతో పాటు సముద్రంలో స్నానానికి దిగిన వారికి ప్రాణ నష్టం కలగకుండా నిర్దిష్ట ప్రదేశంలో సరుగుడు కర్రలతో బారికేడ్లు నిర్మించాలని, గజ ఈతగాళ్లను నియమించాలని సూచించారు. బీచ్‌కు వచ్చే మూడు మార్గాలు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, వైద్య, ఎక్సైజ్ అధికారులు ఆయా శాఖల పరంగా చేపట్టాల్సిన పనులను ఆర్డీవో సూచించారు. సమావేశంలో పేరుపాలెం సర్పంచ్ తిరుమాని విజయ లక్ష్మీనర్సింహమూర్తి, కేపీ పాలెం సర్పంచ్ అందే దొరబాబు, జిల్లా పంచాయతీ అధికారి ఎన్.రామనాధరెడ్డి, తహసీల్దార్ రాజకిషోర్, డీఎల్‌పీవో జ్యోతిర్మయి, డిప్యూటీ ఎంపీడీవో నవీన్‌కిరణ్, పోలీస్, ఎక్సైజ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న హార్టికల్చర్ అడిషనల్ డైరెక్టర్ హరినాథరెడ్డి

ఉత్తమ యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులను అవలంభించడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని హార్టికల్చర్ అడిషనల్ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి సూచించారు. గురువారం జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి, గుర్వాయిగూడెం, చక్రదేవరపల్లి గ్రామాల్లోని ఆయిల్‌పామ్, కోకో, కొబ్బరి తదితర తోటలను, వాటిలోని అంతర పంటలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో ప్రతీ రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులకు ఆదాయ వనరులైన అంతర పంటలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉద్యాన పంటలపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పీడీ. ఎస్.రామ్మోహన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి షాజా నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్, కొయ్యలగూడెం ఉద్యాన శాఖ అధికారి ధీరజ్ లక్ష్మణ్, రైతులు దల్లి రామాంజనేయ రెడ్డి, ఉండవల్లి శ్రీనివాస్, ఇంజనీరింగ్ ప్రసాద్, రైతు సేవా కేంద్రం సిబ్బంది వెంకటేశ్, నాగచందు, రవి పాల్గొన్నారు.

అక్రమంగా గోవుల తరలింపుపై కేసు

పెదపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అరకు నుంచి చిలకలూరిపేటకు మూడు భారీ కంటైనర్లలో 75 గోవులను ఎటువంటి అనుమతులు లేకుండా తరలించడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. గోవుల తరలింపులో సరైన ఆహారం, నీరు అందజేకుండా తీసుకెళుతున్నారంటూ దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. అక్రమంగా కంటైనర్లలో గోవులను తరలిస్తుండగా ఎన్‌డీఏ కూటమి నాయకులు పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద బుధవారం రాత్రి అడ్డుకున్న విషయం తెలిసిందే. ఫిర్యాదు మేరకు గోవులను తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని, వాటిల్లోని గోవులను కొప్పాకలోని గోసంరక్షణ కేంద్రానికి తరలించి అనగాని హరిబాబు, జోగాడ తేజ, అప్పన్న అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు.

నూజివీడు ఎంఈవో-2పై చర్యలకు సిఫారసు

ఏలూరు అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విధులకు అనధికారికంగా గైర్హాజరవుతున్న నూజివీడు ఎంఈవో-2 జమలయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సిఫారసు చేస్తూ ప్రతిపాదనలను పాఠశాల విద్య కాకినాడ ఆర్జేడీకి డీఈవో కార్యాలయం పంపింది. సెలవు పెట్టకుండా, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎంఈవో-2 ఈ నెల 4వ తేదీ నుంచి విధులకు గైర్హాజరవుతున్న విషయాన్ని ఆర్జేడీకి తెలియజేశారు. విద్యాశాఖకు సంబంధించి ప్రభుత్వం అమలు చేసే పథకాలన్నింటినీ ఎంఈవో-2 ద్వారానే పర్యవేక్షించాల్సి ఉండగా, ఆయన అందుబాటులోకి రాకపోవడంతో ప్రస్తుతం ఎంఈవో-1 ద్వారా నెట్టుకొస్తున్నారు. ఎంఈవో-1కు కూడా పనిభారం ఎక్కువగా ఉండటం వల్ల జమలయ్య స్థానంలో ప్రత్యామ్నాయంగా మరో సీనియర్ హెచ్ఎంకు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. కాగా ఆయన బెంగళూరులో ఉన్నట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం.

చికెన్ వ్యర్థాల తరలింపును అడ్డుకున్న పోలీసులు

పెదపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): చేపల చెరువులో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలు తరలిస్తుండగా ఐషర్ వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. తనిఖీల్లో భాగంగా పెదపాడు, పరిసర ప్రాంతాల్లో చికెన్ వ్యర్థాలు కలిగి ఉన్న ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వాహన యజమాని, వాహన డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

కాలిన గాయాలతో వృద్ధురాలి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):స్టౌ మంటలు అంటుకుని ఒక వృద్ధురాలు అగ్ని ప్రమాదంలో మృతి చెందింది. ఏలూరు ఎన్ఆర్ పేటకు చెందిన ఈడా విజయలక్ష్మి(70) కుమారుడు న్యాయవాది కాగా, కుమార్తె లెక్చరర్ ఆమె ఒక్కరే గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఒక్కరే ఉన్నారు. స్టౌ వెలిగించడంతో మంటలు ఆమె చీరకు అంటుకుని అగ్ని ప్రమాదానికి గురైంది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి మృతి చెందిందని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

కల్తీ మద్యానికి సురక్ష యాప్‌తో చెక్ : ఆవులయ్య



ఏలూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా కల్తీమద్యానికి చెక్ పెడుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చారు. మద్యం షాపులో మద్యం సీసాపై బార్‌కోడ్‌ను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య గురువారం పరీక్షించారు. అనుమానం వచ్చినప్పుడు మద్యం వినియోగదారులు మద్యం సీసాపై ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేయగానే, ఆ బాటిల్ నాణ్యత ఒరిజినల్ లేదా నకిలీదో, బ్రాండ్ పేరు, బ్యాచ్ నెంబరు, ఎంఆర్‌పీ, తయారీ ప్రదేశం వంటి పూర్తి వివరాలు వెంటనే తెలుసుకోవచ్చన్నారు. షాపుల్లో విధిగా క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేశాకే మద్యం విక్రయించాలని ఆయన సూచించారు.

విద్యా, ఉపాధి రంగాల సంక్షోభంపై నేడు జిల్లా సదస్సు

ఏలూరు అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏలూరు కొత్తబస్టాండ్ సమీపంలోని ఏఎస్ఆర్ భవన్‌లో జరుగనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సంఘ నాయకులు గురువారం నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. విద్య, ఉపాధి రంగాల సంక్షోభం-విద్యార్థి, యువకుల ఆత్మహత్యలనే అంశంపై గురువారం పీడీఎస్‌వో, ఎన్‌వైఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో ప్రధానవక్తగా డాక్టర్ ఎస్.గోపాల్, పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాషా పాల్గొంటారని ఎల్.భాను తెలిపారు.

నాయకులకు పాదం నాగకృష్ణ కృతజ్ఞతలు

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పోలవరానికి చెందిన పాదం నాగకృష్ణ నియమితులయ్యారని జనసేన నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ వలవల తాతాజీ తెలిపారు. ఈ మేరకు గురువారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణను నాగకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ పదవి రావడానికి సహకరించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్, కరాటం సాయి బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

‘వ్యవసాయ కార్మికులకు భూమిపై హక్కు కల్పించాలి’

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):ఏపీలో 70 శాతం మంది వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని, గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు భూమిపై హక్కు కల్పిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్.కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశానికి కంచర్ల గురవయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు పూర్తి స్థాయిలో హక్కులు కల్పించాలని, పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు బండి వెంకటేశ్వరరావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, నాయకులు నడిమి కామయ్య, కె.ఆనంద్, గోలిమే బాలయేసు, కూరాకుల బాబూరావు, ముళ్ళగిరి లాజరు, గుమ్మడి లక్ష్మీనారాయణ, తాడిగడప జయరాజు, బుగ్గల ప్రభాకరరావు, సూర్యచంద్రరావు, యడ్లపల్లి రమేష్, గుడే ఆశీర్వాదం పాల్గొన్నారు.

22 నుంచి కార్తీకమాస మహోత్సవాలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యనారాయణపేట కాలువ గట్టుపై గల శ్రీగంగా పార్వతీ సమేత రేవులింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 22 నుంచి నవంబరు 20వ తేదీ వరకు కార్తీకమాస మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు వీరుభోట్ల వెంకటేశ్వరరావు శర్మ, యాజ్ఞిక బ్రహ్మ వీరుభోట్ల కృష్ణకుమార్ శర్మలు తెలిపారు. కార్తీకమాసం నెల రోజులు ప్రతీ రోజూ ఉదయం 8 గంటల నుంచి స్వామికి ఏకవార రుద్రాభిషేకం, విశేష పూజలు, అలంకారాలు నిర్వహిస్తామన్నారు. 27న కార్తీక సోమవారం సందర్భంగా స్వామికి ఆవుపాలతో రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం నిర్వహిస్తామని,18న మాస శివరాత్రి సందర్భంగా అన్నాభిషేకం, 20న అమావాస్య సందర్భంగా స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం వేళల్లో లక్ష పత్రి పూజ, లక్ష కుంకుమార్చన ఉంటుందన్నారు.

ఉత్తమ ఇంఫ్యాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్‌గా నాగజ్యోతి



ఏలూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంఫ్యాక్ట్ ఇంటర్నేషనల్ ట్రైనర్‌గా ఏలూరుకు చెందిన కలపాల నాగజ్యోతి ఎంపికయ్యారు. హైద్రాబాదులో ఇంప్యాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో (స్టేజ్‌పై నిలబడి ప్రసంగం చేసే నైపుణ్యం) వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాగ జ్యోతిని అభినందిస్తూ ముఖ్యఅతిథులు అవార్డుతో పాటు సర్టిఫికెట్‌ను బహూకరించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి శిక్షణ పొందిన 60మంది హాజరయ్యారు. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రతిభను కనబరిచిన తనను ఇంఫ్యాక్ట్ ఇంట ర్నేషనల్ ట్రైనర్‌గా ఎంపిక చేసినట్టు నాగజ్యోతి వివరించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులుగా, మోటివేషన్ స్పీకర్‌గా నాగజ్యోతి అర్హురాలని ప్రకటించారు. అలాగే ఇటీవల ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఇంపాక్ట్ ఐపీఐ హైమావతి క్లబ్ అధ్య క్షుడు ఎమ్మెల్ నరసింహరావును అభినందించారు.

భోజన పథకం వేతనాలు, బిల్లుల చెల్లింపునకు డిమాండ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులకు 3 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ అనుబంధ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రకళ, నాగమణి డిమాండ్ చేశారు. బిల్లులు, వేతనబకాయిలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల భోజన పథకం కిరాణా సరుకులను సమకూర్చుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికే 3 నెలలుగా సొంత డబ్బులతో పథకాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులకు ప్రతి నెలా 5వ తేదీలోగా వేతనాలు చెల్లించేలా అధికారులు నిధులు విడుదల చేయాలని కోరారు.

మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌కు ఆమోద ముద్ర పట్ల హర్షం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేయడం పట్ల కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. కొండ్రెడ్డి కిశోర్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, కౌన్సిలర్లు కరుటూరి రమాదేవి, వలవల తాతాజీ, తెలగారపు జ్యోతి మాట్లాడుతూ మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ జీవో విడుదల చేసినట్టు తెలిపారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, తూటిగుంట దుర్గారావు, తూటిగుంట రాము, గెడా సుబ్రహ్మణ్యం, తెలగారపు హనుమంతు, తోట సతీశ్ పాల్గొన్నారు.

సహకార రంగంతోనే ఆర్థిక అంతరాల తగ్గింపు

ఏలూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సహకార రంగంతోనే ఆర్థిక అంతరాల తగ్గింపు సాధ్యమని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్ ఆచార్య నన్నపనేని అంజయ్య పేర్కొన్నారు. 2025 ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సహకార వ్యవస్థ ప్రాధాన్యత లక్ష్యాలు వివరించడానికి ఏలూరు బ్రాంచ్‌లో గురువారం కాశీ విశ్వేశ్వర కల్యాణ మండపంలో సహకార సదస్సు నిర్వహించారు. అంజయ్య మాట్లాడుతూ మానవాళి మనుగడ సహకార రంగంతోనే ఉన్నతంగా మారుతుందన్నారు. ఏలూరు జిల్లా సహకార అధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార సంవత్సరంలో లక్ష్యసాధనకు క్షేత్ర స్థాయిలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ కృషి అభినందనీయమన్నారు. బ్యాంక్ డైరెక్టర్ కోటేశ్వరరావు, జిల్లా సహకార ఉప అధికారి ఎ.వెంకటేశ్వరరావు, ది.విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంక్ జోనల్ మేనేజర్ రాగూర్, ఏలూరు బ్రాంచ్ మేనేజర్ కె.కొండబాబు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలి


గెలలు పరిశీలిస్తున్న శ్రీనివాస్

జీలుగుమిల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాస్కరావు, శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. దర్భగూడెంలో ఆయిల్ పామ్ తోటల్లో పర్యటించి గెలలు నరికి కాటాకు తరలిస్తున్న రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ రైతులకు వారంలో పేమెంట్ చెల్లించాలన్నారు. కాటాల వద్ద పచ్చి గెలల పేరుతో ఏరివేత వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. 15 రోజుల వరకు పేమెంట్ రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యాన శాఖ అధికారులు జోక్యం చేసుకుని అన్ని ఫ్యాక్టరీల్లో వారంలోగా రైతుల ఖాతాల్లో సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాటాల వద్ద బినామీ రైతుల్ని నివారించాలన్నారు. ఈ నెల 30, 31న జంగారెడ్డిగూడెంలో జరిగే జిల్లా మహా సభలను విజయవంతం చెయ్యాలన్నారు. సీతారామయ్య, రాంబాబు, మండల రైతు సంఘం అధ్యక్షులు దాసరి జానకిరామిరెడ్డి ఉన్నారు.

లింగపాలెం మండలంలో రూ.53 లక్షల బకాయి

లింగపాలెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు తమ బకాయిలను త్వరగా చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి లబ్ధిదారులకు సూచించారు. లింగపాలెం మండలపరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. లింగపాలెం మండలంలో మండలంలో వివిధ విభాగాల ద్వారా 16 మంది లబ్ధిదారులు రుణాలు తీసుకున్నారని రూ.53 లక్షల వరకూ బకాయిలు చెల్లించాలన్నారు. రుణాలు త్వరగా చెల్లించడం ద్వారా తిరిగి మరలా రుణాలు పొందేందుకు అవకాశముందన్నారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ ద్వారా బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ తీసుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో ఎ.సుందరి, తహసీల్దార్ నజీముల్లాషా పాల్గొన్నారు.

మరో అడుగు

(3వ పేజీ తరువాయి)

కేఆర్ పురం ఐటీడీఏ చెల్లింపుల ప్రక్రియను నిర్వహిస్తుండగా గృహ నష్ట పరిహారాలకు సంబంధించి ఎస్‌డీసీ-ఏలూరు చెల్లింపుల కోసం బిల్లులు పెట్టాలి. గతంలో విడుదల చేసిన నిధులకు సరిపడా మాత్రమే బిల్లులు పెట్టగా అంతవరకు నిర్వాసితుల ఖాతాల్లో నిధులు జమయ్యాయి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి కేఆర్.పురం ఐటీడీఏ పరిధిలో 600 ఖాతాలకు నిధులు జమ కావాలి. గృహ నష్ట పరిహారాలకు సంబంధించి రెండు వేల ఖాతాలకుపైనే చెల్లించాలి. గతంలో పెండింగులో వున్న బిల్లులతోపాటు కొత్తగా పెట్టబోయే బిల్లులను ప్రభుత్వానికి పంపిస్తే ఆమేరకు నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమయ్యే అవకాశాలున్నాయి.


చింతలపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు


కర్నూలు మోదీ సభలో పాల్గొన్న చంటి


జీలుగుమిల్లిలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

జీఎస్టీ సంస్కరణలతో వ్యాపారం సులభతరం

చింతలపూడి, జీలుగుమిల్లిలో జీఎస్టీ సంస్కరణలపై అవగాహన ర్యాలీలు - పాల్గొన్న అధికారులు, నాయకులు

చింతలపూడి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రవాణ శాఖ ఆధ్వర్యంలో చింతలపూడిలో గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ యార్డులో ప్రారంభమైన ఈ ర్యాలీ బోసుబొమ్మ వరకు జరిగింది. నూజివీడు రవాణ శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 2.0 సంస్కరణలతో జీఎస్టీ పన్నుల్లో మార్పులు వచ్చాయని, దీని వల్ల రవాణ, లాజిస్టిక్ రంగాలకు భారీ లాభాలు సమకూరాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన పన్ను సవరణలతో వ్యాపార నిర్వహణ సులభతరం, సేవల వేగం పెరిగిందన్నారు. గతంలో 28 శాతం ఉన్న పన్ను పది శాతానికి తగ్గించారని, 12 శాతం ఉన్న పన్ను ఐదు శాతానికి తగ్గిందని, పన్ను విధానం సరళీకృతం చేయడంతో దేశంలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ ఏర్పడిందన్నారు. ర్యాలీలో నూజివీడు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జమీర్, అన్నపూర్ణ, జీఎస్టీ అధికారి జాన్ విల్సన్ బాబు, కూటమి నాయకులు టి.అప్పారావు, టి.రామారావు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహించాలని చంటి పిలుపు..

ఏలూరుటూటౌన్: కర్నూలులో ప్రధాని మోదీ సభ సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌లో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పరిశీలకులుగా పాల్గొన్నారు. మూడ్రోజుల నుంచి కర్నూలులోనే మకాంవేసి మోదీ సభకు అన్ని ఏర్పాట్లు బడేటి చంటి చూసుకున్నారు. మోదీ సభ విజయవంతం కావడంతో కష్టానికి తగిన ఫలితం దక్కిందన్నారు. జీఎస్టీ వలన ప్రజలకు జరిగిన మేలును బహిరంగ సభలో ప్రధాని మోదీ వివరించారన్నారు. జీఎస్టీ వల్ల ప్రజలకు కలిగిన లాభాన్ని కూటమి కార్యకర్తలంతా ప్రజలకు వివరించాలన్నారు. జీఎస్టీ తగ్గింపు వలన పేద, మధ్య తరగతి, సామాన్యులకు ఎంతో మేలు జరిగిందన్నారు.

జీలుగుమిల్లిలో ఎమ్మెల్యే చిర్రి బైక్ ర్యాలీ

జీలుగుమిల్లి: సూపర్ జీఎస్టీ సూపర్ - సేవింగ్స్‌తో తక్కువ ఖర్చు మెరుగైన అభివృద్ధి సాధ్యమని కూటమి ప్రభుత్వం నిరూపించిందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లిలో జీఎస్టీ 2-0సంస్కరణతో వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లు, బైక్, పలు ఎలక్ట్రికల్ వస్తువులపై తగ్గిన ధరలపై జంగారెడ్డిగూడెం ఎంవీఐ ఎస్ఎస్.రంగనాయకులు ఎఎంవీఐ కెడివి.రవిగోపాల్, స్టేట్ టాక్స్ కమిషనర్ రసజ్ఞశ్రీ ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. జనసేన, టీడీపీ మండల అధ్యక్షులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణరాజు, ఎంపీటీసీ నాలి శ్రీను, చిర్రి శ్రీను, ఎస్.ఐ. విక్రాంతికుమార్, బండారు అనిల్, కోలా మధు, సతీశ్‌రెడ్డి ఉన్నారు.

సూపర్ జీఎస్టీ వ్యాస రచన పోటీ రాష్ట్ర విజేత రిషిత



ఏలూరు అర్బన్: సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలపై రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో కె.రిషిత విజేతగా నిలిచింది. నిడమర్రు మండలం చిననిండ్రకొలను జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థిని రిషితను గురువారం కర్నూల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బహిరంగ సభలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరపున పాల్గొనగా మంత్రి లోకేశ్ అభినందించారు. ఈ మేరకు డీఈవో వెంకట లక్ష్మమ్మ, సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ పంకజ్ కుమార్, ఏఎంవో ఆర్.రామారావు ఓ ప్రకటనను విడుదల చేస్తూ జిల్లాలో మారుమూల ప్రాంతమైన బైనేపల్లి గ్రామానికి చెందిన వెంకట శ్రీనివాస రావు, వెంకట పార్వతి దంపతులకు జన్మించిన రిషిత రాష్ట్ర స్థాయి విజేతగా నిలవడం గర్వించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర స్థాయిలో వ్యాస రచన, చిత్రలేఖన విభాగాల్లో పోటీలు నిర్వహించగా మొత్తం 13 మంది విజేతలను ఎంపిక చేశారని, వీరిలో ఉమ్మడి జిల్లా నుంచి ఏకైక విజేతగా రిషిత నిలిచిందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో కార్యదర్శులదే కీలక పాత్ర

» ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ


కార్యదర్శులకు సూచనలు చేస్తున్న సీఐ

ఏలూరు క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వార్డు, మహిళా సంరక్షణ కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించాలని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా భద్రతపై అసాంఘిక కార్యకలాపాల నివారణపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యదర్శులతో గురువారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమీక్ష నిర్వహించారు. సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ నిఘా సమాచార సేకరణ వంటి విధులను కార్యదర్శులు నిర్వర్తించాలని, వారు పనిచేసే ప్రాంతాల్లో నిత్యం అప్రమత్తంగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా నిఘా పెట్టాలన్నారు. సచివాలయ పరిధిలో ముందస్తు సమాచారం జరగబోయే, జరుగుతున్న కార్యకలాపాల వివరాలను తెలియజేయాలన్నారు. అక్రమ మద్యం అమ్మకాలు, గంజాయి రవాణా, బాల్య వివాహాలు, పేకాట, కోడిపందాలు వంటి వాటి సమాచారం సేకరించాలన్నారు. సమస్యలను గుర్తించడం, మహిళలకు, పిల్లలకు, బలహీన వర్గాలకు ఎదురయ్యే ఇబ్బందులు గుర్తించి వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. సచివాలయాల వద్దకు వచ్చే వృద్ధులకు డిజిటల్ అరెస్టు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. బాల బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించి సైబర్ నేరాల పట్ల చైతన్యం తీసుకురావాలన్నారు. వన్‌టౌన్ ఎస్ఐ మదీనా బాషా పాల్గొన్నారు.

స్వామికి వెండిబిందె, గంట అందజేత


బిందె అందజేస్తున్న దాతలు

ద్వారకా తిరుమల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సుందర గిరిపై మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో కొలువైన లక్ష్మీనారసింహునికి ఓ దాత వెండి అష్టలక్ష్మీ బిందె, గంట ను బహూకరించారు. చినవెంకన్న దత్తత దేవాలయమైన ఈ ఆలయానికి ఉండ్రాజవరానికి చెందిన గన్నమనేని వెంకట రాజీవ్ 985 గ్రాముల బరువైన వెండి బిందె, గంటను ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తికి అందజేశారు. దీనిని స్వామివారి అభిషేకానికి వినియోగించాలని దాత కోరారు. వీటి విలువ రూ.1.25 లక్షలు ఉండవచ్చని అధికా రులు అంచనా వేస్తున్నారు.


ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న దాతలు

ప్రపంచ ఆహార దినోత్సవం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా నగరంలోని మన్నా చర్చి అధినేత జ్యోతిరాజు తన పేరుతో పెట్టిన ఫౌండేషన్ ద్వారా వ్యానుపై దాదాపు 500మందికి గురువారం ఆహార పొట్లాలు అందజేశారు. జ్యోతిరాజు మాట్లాడుతూ ఆకలితో ఎవ్వరూ అలమటించకూడదనే భావనతో జ్యోతిరాజు ఫౌండేషన్ ద్వారా ప్రతి రోజూ వ్యానుపై పేదలకు ఆహార పదార్థాలను అందజేస్తున్నామన్నారు. దేవస్థానాల వద్ద భిక్షాటన చేస్తున్న వారికి ఆహార ప్యాకెట్లు అందజేసినట్టు తెలిపారు.

బోనస్ ఇవ్వాలని ధర్నా


మాట్లాడుతున్న నాయకుడు వెంకటేశ్వరరావు

పెదవేగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ మేరకు బోనస్ తక్షణం ఇవ్వాలని కోరుతూ పెదవేగి మండలం వంగూరులోని గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట గురువారం ధర్నా నిర్వహించి, ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యూవీ) మాట్లాడుతూ కార్మికులకు బోనస్ ఇస్తామని ఫ్యాక్టరీ యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీ నెరవేర్చడంలో యాజమాన్యం జాప్యం చేస్తోందని ఆయన డిమాండ్ చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ వద్ద జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని, తక్షణం బోనస్ ఇవ్వకుంటే లేబర్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని, మరోవైపు ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా యాజమాన్య ప్రతినిధులు నాగరాజు, షేక్ దురానీలు మాట్లాడుతూ దీపావళికి ముందే బోనస్ ఇచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి.పద్మావతి, కార్యదర్శి ఎం.రంగమ్మ, నాయకులు కోటేశ్వరరావు, ఆలీసమ్మ, బేబీ, లక్ష్మీ, మోతీ భవానీ, సత్యవతి, కృప, అనసూయ, రాణి, సావిత్రి, సుజాత, శంకర్ పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. విధులు నిర్వర్తించండి

నూతన ఉపాధ్యాయులకు యూటీఎఫ్ నేతల సత్కారం


సభ్యత్వం ఇస్తున్న యూనియన్ నాయకులు

పెదవేగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏ సమస్య ఎదురైనా తాము అండగా ఉంటామని విధులను బాధ్యతగా నెరవేర్చాలని కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు యూటీఎఫ్ నాయకులు శాలువా కప్పి సత్కరించారు. పెదవేగి మండలంలో కొత్తగా ఐదుగురు ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరారు. వారికి యూటీఎఫ్ తరపున సంఘ నేతలు సభ్యత్వం ఇచ్చి, శాలువాలతో సత్కరించి అభినందించారు. పెదవేగి మండల సంఘం అధ్యక్షుడు తేరా ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి పోలిరెడ్డి వెంకటరమణ, యూటీఎఫ్ మండల కోశాధికారి మేకా లక్ష్మీనారాయణ,జిల్లా కార్యదర్శి మరీదు లక్ష్మణరావు, కార్యదర్శి కె.గస్పర్, రామశింగవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని టి.వి.పద్మావతి, ఉపాధ్యాయులు వెలివెల శ్రీనివాసరావు, గుంటూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నూతన బ్రాంచ్ ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రమోద్ కుమార్

ఏపీజీబీ సేవలు మెరుగుపరుస్తాం

పెదపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోనూ ఖాతాదారులకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా ఏపీగ్రామీణ బ్యాంక్(ఏపీజీబీ)ను విస్తరిస్తున్నట్టు బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు ఏపీజీబీ శాఖ కార్యాలయాన్ని ఆధునాతన వసతులు, లాకర్ సదుపాయాలతో నూతన ప్రాంగణంలో గురువారం ప్రారంభించారు. మారుమూల ప్రాంతాల్లో కూడా ఏపీజీబీ బ్యాంకు సేవలు విస్తృత పరుస్తామన్నారు.అనంతరం బ్యాంక్ జనరల్ మేనేజర్ జె.జిమ్మిలాల్‌తో కలిసి బ్యాంకు సేవలను, లాకర్ సేవలను ప్రారంభించిన సందర్భంగా పలువురు ఖాతాదారులను సన్మానించారు. బ్రాంచ్ మేనేజర్ అనురూపారావ్ పాల్గొన్నారు.


అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

పెదవేగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించే బాధ్యత తమపై ఉందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చింతమనేని మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నాయకులు తమవంతు సహకారం అందించాలన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన పేదలకు అందేలా చేయాలని, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయా గ్రామాల నాయకులు అనుసరించాల్సిన విధానాలు ప్రభాకర్ సూచించారు.


భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప భక్తులు

నిత్య భిక్షకు అపూర్వ స్పందన

కామవరపుకోట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తడికలపూడిలోని శ్రీగంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నిత్య భిక్ష కార్యక్రమానికి గురువారం అపూర్వ స్పందన వచ్చింది. భారీ సంఖ్యలో అయ్యప్పలు, భవానీలు తరలివచ్చి భజనలు చేసి అనంతరం భిక్షలో పాల్గొన్నారు. నెర్సు గన్నిరాజు, ఆకుల వెంకటేశ్వరరావు, దెందులూరుకు చెందిన గొరిపర్తి యేసుబాబు, విజయ్, శ్రీజలు భిక్ష ప్రదాతలుగా వ్యవహరించారు.

కొప్పాకలో క్షేత్ర స్థాయి పంటల పరిశీలన


యాజమాన్య పద్ధతులు తెలియజేస్తున్న దృశ్యం

పెదవేగి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సరైన అవగాహనతోనే మేలైన పంటల దిగుబడి సాధ్యమని ఏలూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణి కుమార్ అన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థినులు క్షేత్ర స్థాయి పంటల పరిశీలన పెదవేగి మండలం కొప్పాకలో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా పంటల నిర్వహణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ కళాశాల విద్యార్థినులు కొప్పాక గ్రామ పటాన్ని ఏర్పాటు చేసి, గ్రామ భౌగోలిక పరిస్థితులను రైతులకు వివరించారు. డాట్ శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ గ్రామస్థాయి సమస్యలు, వనరులు, రైతుల అవసరాలను గుర్తించి సాగు చేపట్టాలన్నారు. గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమం విద్యార్థులు భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్ పి.భాస్కరదీక్షితులు, పెదవేగి మండల వ్యవసాయాధికారి సి.హెచ్.శ్రీనివాసరావు, వ్యవసాయకళాశాల విద్యార్థినులు మానస, చంద్రిక, సౌజన్య, సౌమ్య, సృజన, సుష్మ పాల్గొన్నారు.

ఐటీ ఉపాధి అవకాశాలపై అవగాహన

పెదపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో కంప్యూటర్ సైన్స్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్, కెరీర్ గైడెన్స్ ప్లేస్ మెంట్ ఆధ్వర్యంలో ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలనే అంశంపై గురువారం అవగాహన కల్పించారు. నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్య ప్రాధాన్యత సంతరించుకుందని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ), సైబర్ సెక్యూరిటీ వంటి వాటికి ఉపాధి అవకాశాలున్నాయని, మారుతున్నకాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. చాతుర్య, సరళ, హిమ బిందు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలివ్వాలి

టి.నర్సాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలో మిగులు భూముల్లో సాగు ప్రారంభించిన పేదలకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. టి.నర్సాపురంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలో సుమారు 1500 ఎకరాల రెవెన్యూ, అటవీ శాఖలకు చెందని భూములున్నాయని ఆభూముల్లో సాగు ప్రారంభించిన పేదలను అడ్డుకోవడం తగదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

ఘనంగా అన్నదానం

పోలవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పోలవరం షిర్డీసాయి ఆలయంలో గురువారం దత్త సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పోలవరం పంచాయతీ నూతన గూడెం గ్రామానికి చెందిన అనిశెట్టి లక్ష్మీపతి తల్లిదండ్రులు అనిశెట్టి కృష్ణాయమ్మ రామచంద్రరావుల జ్ఞాపకార్థం జరిపిన ఈ అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

మిల్లర్లకు తహసీల్దార్ సూచన

భీమడోలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం తేమ శాతం లేకుండా ధాన్యాన్ని మిల్లులోకి తరలించేలా ముందస్తు ప్రణాళికలను అనుసరించి మిల్లర్లు నడుచుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. భీమడోలు మండల పరిషత్ సమావేశంలో రైస్ మిల్లర్లు కస్టోడియన్ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించారు.ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ చేయించి తహసీల్దార్ రమాదేవి సూచించారు. ఏవో ఉషారాణి పాల్గొన్నారు.

వాహన రికార్డుల తనిఖీ

లింగపాలెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని ధర్మాజీగూడెం ప్రధాన రహదారిపై ఎస్ఐ కె.వెంకన్న వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడిపేవారు తప్పని సరిగా రైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపకూడదన్నారు. మైనర్‌లకు వాహనాలిచ్చే తల్లిదండ్రులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీలలో సిబ్బంది పాల్గొన్నారు.

బంజారా భక్తులకు సూచన

ఏలూరు అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్న బంజారా మహంతు హాథీరామ్ భావాజీ జీవ సమాధి దివస్ బర్సి ఉత్సవంలో జిల్లాలోని అన్ని తండాల నుంచి బంజారా భక్తులు పాల్గొనాలని ఎస్టీ బంజారా, లంబాడీ, సుగాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కృష్ణ, రాజాబాబు ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 14న సేవాఘడ్‌లో సేవాలాల్ జ్యోతి ఝరీ రథయాత్ర ప్రారంభమైందని, తిరుపతికి 18న ఉదయం చేరుకుంటుందన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

దెందులూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని పోతునూరు ఆర్సీఎం చర్చి ఫాదర్ తంబి అన్నారు. దెందులూరు మండలం పోతునూరులోని ఆర్సీఎం చర్చిలో సంఘం ఆధ్వర్యంలో కుటుంబ ఆరాధన కార్యక్రమాలను నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా ఫాదర్ తంబి మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావన సమాజంలో శాంతిని పెంపొందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకుని, శాంతియుత జీవనాన్ని కొనసాగించాలని ఆయన సూచించారు. సంఘ పెద్దలు చల్లా బాల స్వామి, లింగాల శ్రీను, నున్నా రవి, మురగల రాయప్ప పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

దెందులూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోకో రైతులు తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేసుకోవాలని దెందులూరు ఉద్యానశాఖాధికారి బి.కిరణ్ అన్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటలకు అందిస్తున్న రాయితీలు పథకాల వివరాలను ఆయన తెలియపర్చారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో కొబ్బరి తోటల అభివృద్ధికి సంబంధించి హెక్టారుకు రూ.28 వేలు రాయితీలు అందిస్తోందన్నారు. ఆయిల్ పామ్ తోటల్లో కొబ్బరి మట్టలను కత్తిరించడానికి అనువుగా ఉడ్ చిప్పర్ మిషన్ 50 శాతం రాయితీపై అందిస్తోందని, బిందు సేద్యం పరికరాలపై జీఎస్టీ తగ్గింపుతో రైతులకు హెక్టారుకు రూ.5 వేలు తగ్గుదల ఉంటుందన్నారు. కోకో రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని, అప్పుడే ప్రభుత్వ రాయితీల లబ్ధి అందుతుందని వివరించారు.

భోగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో చెత్త తొలగింపునకు చర్యలు

కలిదిండి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం పురస్కరించుకుని కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో చెత్తాచెదారం తొలగింపు పనులు ప్రారంభించామని ఈవో శేఖర్ తెలిపారు. ఆలయ ఆవరణలో దట్టంగా పిచ్చిమొక్కలు పెరగడంతో భక్తులకు రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. ప్రస్తుతం కూలీలతో పిచ్చిమొక్కలు తొలగిస్తున్నామన్నారు. పెద్దగా ఉన్న పిచ్చిచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి ఆవరణ మొత్తం చదును చేయిస్తామన్నారు. పంచబుగ్గల కోనేరులో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు.

ట్రిపుల్ ఐటీలో సంగీతం వర్క్‌షాపు



నూజివీడు టౌన్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి):నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సంగీత విభాగానికి సంబంధించి సాధన వర్క్‌షాపును నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ గురువారం ప్రారంభించారు. గాత్ర విద్వాంసురాలు వి.లలితాచంద్రశేఖర్ సంగీతంలో ప్రాథమిక అంశాలను విద్యార్థులకు వివరించారు. ఏవో డాక్టర్ లక్ష్మణ్, సంగీత విభాగం హెచ్‌వోడీ జె.చంద్రమౌళి పాల్గొన్నారు.

యువతకు ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫామ్ 'నూజివీడు ఉయ్‌లీడ్'

▸ నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం : సబ్ కలెక్టర్ వినూత్న



నూజివీడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని యువతకు వారిలోని సృజనాత్మకత, డిజిటల్ నైపుణ్యాలు, సామాజిక బాధ్యతలను ప్రదర్శించడం కోసం 'నూజివీడు ఉయ్‌లీడ్' అనే ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేశామని సబ్‌కలెక్టర్ బి.వినూత్న తెలిపారు. గురువారం నూజివీడులో ఆమె మాట్లాడుతూ ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా యువత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసేవ చర్యలు, విజయాలను ప్రజలకు చేరవేయటానికి ఉపయోగపడుతుందన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో యువతకు డిజిటల్ కమ్యూనికేషన్, సోషల్‌మీడియా అవుట్‌రీచ్, సృజనాత్మక ఆలోచనలు, సమాజంపై సానుకూల ప్రభావం చూపేమార్గాలపై చర్చించటానికి, వారి ప్రతిభను ప్రదర్శించటానికి అవకాశం లభిస్తుందని తెలిపారు. ఆసక్తిగల వారు శుక్రవారం జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని ఆమె కోరారు.

ఆదమరిస్తే అంతే..

▸ కోతకు గురైన నూజివీడు-ధర్మాజీగూడెం ప్రధాన రహదారి



నూజివీడు-ధర్మాజీగూడెం రోడ్డుపై కోతకు గురైన రహదారి

నూజివీడు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నూజివీడు-ధర్మాజీగూడెం ప్రధాన రహదారిపై భారీవర్షాలకు రహదారి కోతకు గురవ్వడంతో ప్రమాదం పొంచి వుంది. నూజివీడు నుంచి రమణక్కపేట మీదుగా ధర్మాజీగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై దిగవల్లి గ్రామం వద్ద రాళ్లవాగు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొంగి ప్రవహించడంతో రహదారి కోతకు గురైంది. రాళ్లవాగు వద్దే ఆర్‌అండ్‌బీ రహదారి మలుపు ఉండడంతో రాత్రిపూట వాహనదారులు ఆదమరిచి వస్తే ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ఐదేళ్ల క్రితం పడిన భారీవర్షాలకు ఇదేవిధంగా కోతకు గురికాగా గత ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి వల్ల నాలుగేళ్ల తరువాత తూతూమంత్రంగా మరమ్మతులు చేపట్టారు. మరోవైపు రాళ్లవాగు ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూముల వారు వాగును ఆక్రమించడంతో భారీ వర్షాల సమయంలో రహదారిపై పొంగి ప్రవహిస్తోంది. ఇప్పటికైనా వంతెన సమీపంలో మేటను తొలగించడంతో పాటు రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పంట బోదె పూడ్చిన వ్యక్తిపై కేసు

కలిదిండి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పంట బోదెను పూడ్చిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండలంలో కాళ్లపాలెంకు చెందిన పాశం చినవీరస్వామి కాళ్లపాలెం శివారున అరుతెగలపాడు- వెంకటాపురం రహదారి పక్కన ఉన్న పంటబోదెను ఆక్రమించి పూడ్చివేశారు. ఈనేపథ్యంలో వర్షపు నీరు రహదారిపై నిల్వ ఉంటుంది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో పంటబోదెలో పూడికతీయాలని పలుమార్లు చిన వీరాస్వామికి సూచించినప్పటికీ పట్టించుకోకపోవడంతో కార్యదర్శి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

నాగుల చవితిని విజయవంతంగా నిర్వహిద్దాం

▸ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ గంగాశ్రీదేవి



సమావేశం నిర్వహిస్తున్న గంగా శ్రీదేవి

ముదినేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరాయ పాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో వున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 25న జరుగనున్న నాగుల చవితి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామస్థులు, పంచాయతీ అధికారులు సహకరించాలని దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి కోరారు. గురువారం దేవస్థానంలో సింగరాయపాలెం, శ్రీహరిపురం, చేవూరుపాలెం గ్రామస్థులు, ఆయా పంచాయతీల సిబ్బందితో ఉత్సవాల నిర్వహణపై జరిపిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, దేవస్థానం మాజీ చైర్మన్ పసుపులేటి నరసింహారావు, చేవూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు బొమ్మిశెట్టి వెంకన్న, గ్రామ పెద్దలు ఆనందాసు కృష్ణమూర్తి భగవతార్, రంగిశెట్టి గోవర్ధనరావు, బూరుబోయిన ప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

వైద్యుల సమ్మెకు మద్దతుగా ఆశావర్కర్ల నిరసన



ముసునూరు పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్ల నిరసన

ముసునూరు, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): సమస్యల పరిష్కారానికి సమ్మెబాట పట్టిన వైద్యులకు మద్దతుగా ఆశావర్కర్లు నల్ల బ్యాడ్జీలను ధరించి ముసునూరు పీహెచ్‌సీ వద్ద గురువారం నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో దీర్ఘకాలంగా వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్షంగా నిరసన కార్యాక్రమంలో పాల్గొంటామని ఆశాలు పేర్కొన్నారు. యూనియన్ నాయకులు మద్దాల సునీత, రజిని, శకుంతల, నిర్మల తదితరులు మాట్లాడుతూ వైద్యుల ప్రధాన సమస్యలుగా ఉన్న జీవో 99 రద్దు చేసి, ఇన్-సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని, తదితర వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, ఆశాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల బహూకరణ



విద్యార్థులకు క్రీడాదుస్తులను అందించిన దృశ్యం

నూజివీడు టౌన్, అక్టోబర్ 16 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులను బహూకరించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని మంగలక్ష్మి పాఠశాలలోని క్రీడాకారులకు ఈ క్రీడాదుస్తులను బహూకరించినట్లు హెచ్‌ఎం విజయకుమారి తెలిపారు. నూజివీడు మండల పరిధిలో పలు క్రీడాంశాల్లో గెలుపొంది సబ్‌జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు క్రీడాదుస్తులను అందించినట్లు ఆమె తెలిపారు.

అనుమతులతోనే బాణసంచా విక్రయించాలి



అడవినెక్కలంలో దుకాణం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

ఆగిరిపల్లి, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : అనుమతులతోనే బాణసంచా విక్రయించాలని, లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలోని వట్టిగుడిపాడు, ఆగిరిపల్లి, అడవినెక్కలం గ్రామాల్లో ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాల స్థలాలను గురువారం ఏఎస్ఐ టి.నాయక్ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాణసంచా దుకాణాదారులు జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మరో అడుగు

(5వ పేజీ తరువాయి)

కేఆర్‌పురం ఐటీడీఏ చెల్లింపుల ప్రక్రియను నిర్వహిస్తుండగా గృహ నష్ట పరిహారాలకు సంబంధించి ఎస్‌డీసీ-ఏలూరు చెల్లింపుల కోసం బిల్లులు పెట్టాలి. గతంలో విడుదల చేసిన నిధులకు సరిపడా మాత్రమే బిల్లులు పెట్టగా అంతవరకు నిర్వాసితుల ఖాతాల్లో నిధులు జమయ్యాయి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి కేఆర్.పురం ఐటీడీఏ పరిధిలో 600 ఖాతాలకు నిధులు జమ కావాలి. గృహ నష్ట పరిహారాలకు సంబంధించి రెండు వేల ఖాతాలకుపైనే చెల్లించాలి. గతంలో పెండింగులో వున్న బిల్లులతోపాటు కొత్తగా పెట్టబోయే బిల్లులను ప్రభుత్వానికి పంపిస్తే ఆ మేరకు నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ అయ్యే అవకాశాలున్నాయి.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



జయపురంలో పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేస్తున్న డైరెక్టర్

పెండ్లి కుమారులకు బంగారు నాణేల అందజేత

చాట్రాయి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయపురం, పోలవరం పాల సహకార సంఘం సభ్యులైన పాడి రైతులు నందిగం సుబ్బారావు కుమారుడు సతీష్‌కుమార్, బిలుగుది లూర్దురాజు కుమారుడు చిట్టిబాబు వివాహాలు గురువారం జరిగాయి. కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద ఇద్దరు పెండ్లి కుమారులకు రూ.20 వేలు విలువైన బంగారు నాణేలను సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, క్లస్టర్ మేనేజర్ దిలీప్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్ అందజేశారు. సంఘ అధ్యక్షులు చెలికాని శ్రీరామ్, కొల్లి వరప్రసాదరావు, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.



కాట్రేనిపాడులో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కాట్రేనిపాడులో పేలిన గ్యాస్ సిలెండర్లు

▸ తప్పిన పెను ప్రమాదం.. రూ.లక్ష ఆస్తి నష్టం

ముసునూరు,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడు ఎస్సీకాలనీలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.లక్ష ఆస్థి నష్టం వాటిల్లింది. కలపాల పోతురాజు కుటుంబసభ్యులతో కలిసి ఉదయం కూలి పనులకు వెళ్లగా.. ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ సిలెండర్ల నుంచి గ్యాస్ లీక్ కావడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. కొద్దిసేపటికి సిలెండర్లు పేలి ఇంటిలో నుంచి మంటలు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటితో పాటు విలువ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబసభ్యులు నిరాశ్రయులయ్యారు. ప్రమాద ఘటనను గ్రామ వీఆర్వో మణేంద్రరావు పరిశీలించి, రూ.లక్ష వరకు ఆస్తి నష్టం ఉన్నట్టు నివేదికను తయారు చేసి తహసీల్దార్ దాసరి ప్రశాంతికి అందజేసినట్లు వీఆర్వో తెలిపారు.

టీడీపీ నేత చెన్నకేశవరావు మృతి



చెన్నకేశవరావు (ఫైల్)

చాట్రాయి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణారావుపాలెం గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి చిమట బోయన చెన్నకేశవరావు(50) గురువారం చనుబండ సెంటర్‌లోని టీస్టాల్ వద్ద గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. టీ తాగేందుకు వచ్చిన ఆయన స్నేహితులతో మాట్లాడుతూనే ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. సమాచారం మేరకు 108 సిబ్బంది వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో కృష్ణారావుపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ చిమటబోయన పుల్లారావు, పలువురు టీడీపీ నాయకులు పార్థీవదేహం వద్ద నివాళులర్పించారు.

కారు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు

ముదినేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి-గుడివాడ ప్రధాన రహదారిలో పెదపాలపర్రు గ్రామ సమీపంలో బైక్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వడాలి గ్రామానికి చెందిన కాగిత గోపాలం, అతడి భార్య శివపార్వతి బైక్‌పై ఈనెల 12న గుడివాడ నుంచి ఇంటింటికి తిరిగి వస్తుండగా, ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొంది. బైక్‌నుంచి కిందపడిన ఆమెకు ఎడమ భుజం ఎముక విరుగగా, గోపాలానికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని విజయవాడ ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా, అక్కడి నుంచి గురువారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ముదినేపల్లి పీఎస్ హెచ్‌సీ ఎస్.వి.రామారావు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

నూజివీడు టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని హెడ్‌కానిస్టేబుల్ జి.వి.వి.ఎస్.ఎన్ రాజు తెలిపారు. గురువారం నెహ్రూ పేట శివారులోని మామిడితోటలో పేకాటాడుతున్నట్టు సమాచారంతో దాడి చేసి వారి వద్ద నుంచి రూ.3,050 నగదును స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఘన సన్మానం



నూతన టీచర్లను సన్మానిస్తున్న తల్లిదండ్రులు

చాట్రాయి, అక్టోబరు 16(ఆంధ్ర జ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికై తుమ్మగూడెం హెచ్ డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన ఎస్.కిరణ్‌కుమార్(నూజివీడు), వెంకట క్రాంతి(చల్లపల్లి)లను గురువారం స్కూల్‌లో విద్యార్థులు తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని విద్యార్థుల తల్లిదండ్రులు నూతన ఉపాధ్యాయులను కోరారు. తాము మధ్యతరగతి కుటుంబాలలో పుట్టి మంచి లక్ష్యంతో చదివి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందామని, నాణ్యమైన విద్యను అందించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామని ఉపాధ్యాయులు అన్నారు. తుమ్మగూడెం ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం గంపా వెంకట్రావు కుమార్తె నిహారికయాదవ్ పుట్టినరోజు సందర్భంగా 25 మంది విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. పాఠశాల చైర్మన్ ఎం.సత్యవతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కైకలూరులో జీఎస్టీ తగ్గుదలపై కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కూటమి నేతలు, అధికారులు.. నూజివీడులో జీఎస్టీపై అవగాహన ర్యాలీలో రవాణాశాఖ అధికారులు

'జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు'

▸ కైకలూరు, నూజివీడుల్లో అవగాహన ర్యాలీలు

కైకలూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించడం వల్ల అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కూటమి పార్టీ నేతలు అన్నారు. గురువారం కైకలూరులో రోడ్డు రవాణా ట్రాన్స్‌పోర్టు అధికారుల ఆధ్వర్యంలో వాహనాలపై జీఎస్టీ తగ్గుదలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. కైకలూరు మార్కెట్ యార్డు నుంచి తాలుకా సెంటర్ వరకు ర్యాలీ చేశారు. ర్యాలీలో కూటమి నేతలు, ఆటోవర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీఏ అధికారులు మాట్లాడుతూ కొత్త వాహనాలపైనే కాకుండా విడి భాగాలపై జీఎస్టీ భారీగా తగ్గిందని వాహనదారులు గమనించి కొనుగోలు చేసుకోవాలన్నారు. ఎంపీడీవో ఆర్. రాజబాబు, కైకలూరు రూరల్ సీఐ వి.రవికు మార్, టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీను, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, కేకే బాబు, కాంట్రాక్టర్ కృష్ణంరాజు, తలారి రాజేష్, మంగినేని రామకృష్ణ, పాల్గొన్నారు.

● నూజివీడు టౌన్ : వాహన కొనుగోళ్లలో జీఎస్టీ తగ్గింపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రాంతీయ రవాణా అధికారి ఎస్.బాలేంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలో 'సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్'పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ సహకారంతో కేంద్రం ప్రవేశపెట్టిన జీఎస్టీ సవరణలతో వాహన కొనుగోళ్లలో ధరల తగ్గుదలను ప్రతిఒక్కరూ గమనించాలన్నారు. ఈ సందర్భంగా కార్లు, ఆటోలతో భారీర్యాలీ నిర్వహించారు. గతంలో చిన్నవాహనాలు, ట్రాక్టర్లు, కార్లకు 28శాతం జీఎస్టీ ఉండేదని, ప్రస్తుతం 12 శాతానికి తగ్గించారన్నారు. టైర్లపై భారీ తగ్గింపు ఉందన్నారు. ఏఎంవీఐలు కృష్ణవేణి, అన్నపూర్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



దళితవాడలో గ్రామసభకు అధికారులు రాకపోవడంతో ఖాళీగా వున్న కుర్చీలు.. చేవూరులో గ్రామస్థుల పోటీ ధర్నా.. సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

చేవూరులో పోటాపోటీ ధర్నాలు

▸ దళితవాడలో గ్రామసభ.. మరోవైపు గ్రామస్థులు, సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు

▸ చేపల చెరువుల తవ్వకాలపై సర్వే చేసి ముంపు సమస్య పరిష్కరిస్తాం : తహసీల్దార్

ముదినేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చేపలు, రొయ్యల చెరువుల నుంచి వస్తున్న వృథా నీటి వల్ల గ్రామంలో ఏర్పడుతున్న ముంపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం గ్రామంలో పోటాపోటీగా నిర్వహించిన ధర్నాలు, గ్రామ సభలు, అదే సమయంలో సీపీఎం నాయకుల నిరసన ప్రదర్శనలతో చేవూరు గ్రామం గురువారం దద్దరిల్లింది. వివరాలివి.. చేవూరు గ్రామం పక్కనే తవ్విన చెరువుల వల్ల సమీపంలోని గృహాల ఆవరణలో ముంపునకు గురై తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని దళితవాడ వాసుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ లతీఫ్ పాషా బుధవారం చెరువులను పరిశీలించారు. ఈ సమస్య పరిష్కారానికి గురువారం గ్రామ సభను ఏర్పాటు చేసి చర్చిద్దామని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామ సభను నిర్వహించేందుకు దళితవాడలో స్థానికులు ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ తన సిబ్బందితో వీఆర్వో కార్యాలయం వద్ద గ్రామ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయించి దళితులకు సమాచారం పంపారు. సమస్య దళితవాడలో ఉండడంతో చర్చించేందుకు గ్రామ సభ వీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేయడం ఏమిటని అభ్యంతరం చెబుతూ దళితులు అక్కడికి వెళ్లలేదు.

గ్రామస్థులు, సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు

గ్రామంలోని మరో వర్గం వారు గ్రామం చుట్టూ ఉన్న చేపలు, రొయ్యల చెరువుల నుంచి వస్తున్న వృథా నీరు సజావుగా పోయేందుకు కాల్వలు తవ్వించాలని గ్రామం మొత్తాన్ని ముంపుబారిన పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. దీంతో పరిస్థితి రసవత్తరంగా మారింది. దళితవాడలో గ్రామ సభ ఏర్పాటు చేయడం, గ్రామంలోని మరికొందరు ధర్నా చేయడంతో సమస్య మరో మలుపు తిరిగింది. ఈక్రమంలో సీపీఎం నాయకులు శేషపు మహంకాళిరావు, చిన్నం మాధవ పార్టీ కార్యకర్తలతో కలిసి చేవూరు వచ్చి చేపల చెరువుల వల్ల దళితవాడలో ఏర్పడిన ముంపును పరిశీలించారు. చెరువుల వల్ల దళితవాడ ముంపునకు గురవుతూ ఉండగా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ దళితులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. దళిత వాడలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు తహసీల్దార్, ఇతర అధికారులు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామానికి చెందిన మద్దుల అశోక్, రాజేష్, స్వామి, తదితరులు దళిత వాడలోనే గ్రామ సభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామస్థుల డిమాండ్ మేరకు చేపల చెరువుల తవ్వకాలపై సర్వే నిర్వహించి ముంపు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పర్వతాపురం ఫారెస్ట్ వద్ద వన సంరక్షణ సమితి సభ్యులు, గ్రామస్థులు

నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

▸ వన సంరక్షణ సమితి సభ్యులు, గ్రామస్థులు

చాట్రాయి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతాపురం వన సంరక్షణ సమితి నిధులు రూ.38 లక్షలు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకొని, సొమ్ము రికవరీ చేయాలని వన సంరక్షణ సమితి సభ్యులు, లబ్ధిదారులైన గ్రామస్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వన సంరక్షణ సమితి భూముల్లో గురువారం విలేకరుల సమావేశంలో సర్పంచ్ మిద్దే శివాజీ, సమితి సభ్యులు, గ్రామస్థులు మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం పర్వతాపురం ఫారెస్ట్‌లో 200 మంది కూలీలు, 12 మంది సభ్యులు, అధ్యక్షుడితో వన సంరక్షణ సమితిని ఏర్పాటు చేసి జామాయిలు, తేక తుమ్మ, గానుగ మొక్కలు నాటారన్నారు. ఇవి చెట్లుగా పెరిగిన తరువాత వచ్చిన ఆదాయం రూ.38 లక్షలు వన సంరక్షణ సమితి బ్యాంకు ఖాతాకు ఫారెస్ట్ అధికారులు జమ చేశారఅన్నారు. సమితి అధ్యక్షుడు ఎటువంటి గ్రామసభ నిర్వహించకుండా నకిలీ పత్రాలతో నిధులు డ్రా చేసి స్వాహా చేశారన్నారు. ఇటీవల ఇది వెలుగులోకి రావడంతో నూజివీడు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తరువాత అధ్యక్షుడు లబ్ధిదారులకు గడ్డపారలు పంపిణీ చేస్తూ, కూలీలకు అరకొర సొమ్ము చెల్లిస్తానని చెబుతు న్నారని, దీనిని అంగీకరించబోమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిధుల స్వాహాపై విచారణ జరిపి కూలీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిగ్గుతేల్చాలి : సీపీఐ డిమాండ్

పర్వతాపురం వన సంరక్షణ సమితిలో నిధుల దుర్వినియోగాన్ని ఉన్నతాధికారులు నిగ్గు తేల్చి, పేదలకు న్యాయం చేయాలని నూజివీడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి నిమ్మగడ్డ నరశింహ, నియోజకర్గ కార్యవర్గ సభ్యుడు ఈవీ శ్రీనివాస్, మండల నాయకుడు కొమ్ము ఆనందం డిమాండ్ చేశారు. గురువారం వన సంరక్షణ సమితి సభ్యులతో సీపీఐ నాయకులు సమావేశమై వివరాలు అడిగి తెలుసుకుని మాట్లాడారు.

అథ్లెటిక్స్‌లో త్రివిధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో త్రివిధ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

నూజివీడు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌లో నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. నూజివీడు మండలస్థాయి నుంచి అథ్లెటిక్స్ పరుగుపందెం విభాగంలో అండర్-14 100 మీటర్ల విభాగంలో దానియేల్ రాయ్, 200 మీటర్ల విభాగంలో పి.సంగీత్, 400 మీటర్ల విభాగంలో బి.కార్తీక్, అండర్-17, 100 మీటర్ల విభాగంలో సీహెచ్ రాహుల్, 200 మీటర్ల విభాగంలో ఎస్.ప్రవీణ్, 800 మీటర్ల విభాగంలో వి.శ్యామ్, కె.రోనికమల్, 1500 మీటర్ల విభాగంలో కె.ఉదయ్, జి.లక్ష్మణ్, మూడు కిలోమీటర్ల విభాగంలో ఎస్.ప్రవీణ్, కె.రోనికమల్, ఐదు కిలోమీటర్ల నడక విభాగంలో కె.జశ్వంత్, షేక్ సుభానీ, లాంగ్‌జంప్‌లో సీహెచ్ రాహుల్, డిస్క్‌త్రో విభాగంలో పి.శ్యామ్‌బాబు సబ్‌జోన్‌కు ఎంపికైనట్టు తెలిపారు.

నూజివీడు ఎంఈవో-2పై చర్యలకు సిఫారసు

ఏలూరు అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విధులకు అనధికారికంగా గైర్హాజరవుతున్న నూజివీడు ఎంఈవో-2 జమలయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సిఫారసు చేస్తూ ప్రతిపాదనలను పాఠశాలవిద్య కాకినాడ ఆర్జేడీకి డీఈవో కార్యాలయం పంపింది. సెలవు పెట్టకుండా, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎంఈవో-2 ఈనెల 4వ తేదీ నుంచి విధులకు గైర్హాజరవుతున్న విషయాన్ని ఆర్జేడీకి తెలిపారు. విద్యాశాఖకు సంబంధించి ప్రభుత్వం అమలుచేసే పథకాలన్నింటినీ ఎంఈవో-2 ద్వారానే పర్యవేక్షణ చేయాల్సిఉండగా, ఆయన అందుబాటులోకి రాకపోవడం వల్ల ప్రస్తుతం ఎంఈవో-1 ద్వారా నెట్టుకొస్తున్నారు. ఆయన బెంగళూరులో వున్నట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్టు సమాచారం.

'కాలుష్య రహితంగా దీపావళి'

నూజివీడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాలుష్యరహితంగా దీపావళిని నిర్వహించేందుకు విద్యార్థులు అవగాహనతో ముందుకు వెళ్లాలని నూజివీడు ఎస్ఐ నాగరాజు అన్నారు. నూజివీడు శారద పాఠశాలలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కాలుష్య రహిత దీపావళి పండుగ నిర్వహించే అంశమై అవగాహన, క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

కర్రతో దాడి చేశారని ఫిర్యాదు

నూజివీడు టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కర్రతో దాడిచేసి చంపుతామని బెదిరించారంటూ ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఆర్.ఆర్‌పేటకు చెందిన అరికోటి అజయ్‌కుమార్ ఈనెల 15వ తేదీన షేక్ బాజిబాబు, హేమంత్ అనే వ్యక్తులు తనపై కారణం లేకుండానే కర్రతో దాడి చేయడమే కాకుండా చంపుతామంటూ బెదిరించారని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.